
సోమశిలలో 15.838 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 3: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 16.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

వామ్మో.. ఆ ఫైళ్లా!?

- రెవెన్యూ వ్యవహారాలకు దూరంగా కొత్త తహసీల్దార్లు
- భూసమస్యల పరిష్కారానికి వెనుకడుగు
- ఎన్నికల విధులపైనే మొగ్గు

గతంలో జరిగిన భూకుంభకోణాలే కారణం

ఏంచేస్తే ఎక్కడ ఇరుక్కుంటామోనన్న భయం

ప్రజల సమస్యలనూ పట్టించుకోని వైనం

నెల్లూరు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నేతల ధనదాహనం ప్రజలకు శాపంగా మారింది. నాలుగన్నరేళ్లపాటు విచ్చలవిడిగా రెవెన్యూ రికార్డులను మార్చేయడం, తద్వారా భూసమస్యలు తలెత్తడం ఫలితంగా కోర్టు కేసులు, సస్పెన్షన్లు ఎక్కువయ్యాయి. జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది పనితీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో గతంలో పనిచేసిన తహసీల్దార్లంతా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు బదిలీ అయ్యారు. అక్కడున్న వాళ్లు జిల్లాకు వచ్చారు. గత అనుభవాల నేపథ్యంలో కొత్తగా వచ్చిన తహసీల్దార్లు రెవెన్యూ వ్యవహారాల జోలికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఏ ఫైల్ ముట్టుకుంటే ఏం జరుగుతుందోనన్న భయం వారిలో కనిపిస్తోంది. ఎన్నికల కోసం జిల్లాకు వచ్చి, అధికార పార్టీ నేతలు చెప్పిందల్లా చేస్తే జీవితాంతం ఆ పాపాలను మోయాల్సి వస్తుందని కొందరు తహసీల్దార్లు అంతరంగిక సమావేశాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో సాధారణ సమస్యలను కూడా వారు పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన కుంభకోణాలు ఇతర జిల్లాల తహసీల్దార్లను ఆందోళనకు గురి చేస్తున్నాయి. 'మేము పనిచేసే మండలంలోని పరిస్థితులు మాకు తెలియవు కదా.. మేము ఎన్నికల పనుల్లో హడావిడిగా ఉన్నప్పుడు, స్థానికంగా ఉండే వీఆర్వోనో లేదా ఆర్ఐనో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుడు నివేదికలు ఇస్తే ఆ తర్వాత మేము ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఎన్నికల తర్వాత మేము మాజిల్లాలకు వెళ్లిపోయినా విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గతంలో జరిగిన వ్యవహారాలను చూశాం కదా.. మళ్లీ ఆ ఊబిలోకి దిగడం ఎందుకు..? ఏదో ఎన్నికలకు వచ్చాం.. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేసుకొని వెళ్లి పోతాం' అంటూ ఓ తహసీల్దార్ వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఇతర జిల్లాల తహసీల్దార్లు అతి జాగ్రత్తతో వ్యవహరిస్తుండడంతో సాధారణ రెవెన్యూ సమస్యలకూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మ్యుటేషన్లు, కన్వెర్షన్లు, భూసేకరణ.. ఇలా రెగ్యులర్‌గా నడిచే పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఈ విషయాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లందరినీ ఉన్నతాధికారులు కలెక్టరేట్‌కు పిలిచి దిశానిర్దేశం చేయడం గమనార్హం. కొత్త తహసీల్దార్ల రాకముందు వరకు అనేక ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయాల్లో సిద్ధమయ్యాయి. వీటిల్లో రెవెన్యూ రికార్డుల కరెక్షన్లు, అసైన్డ్ భూముల క్లియరెన్స్, నిషేధిత జాబితా నుంచి తొలగింపు వంటి పలు క్లిష్టమైన సమస్యల ఫైళ్లు ఉన్నాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది.





దీంతో గత తహసీల్దార్లు తయారు చేసిన ఫైళ్లను కొత్త తహసీల్దార్లు పక్కన పెడుతున్నారు. కొన్ని మండలాల్లో ప్రస్తుత తహసీల్దార్లపైనా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఎక్కువవుతుండటంతో వారు అక్కడి నుంచి తమను వేరే చోటకు పంపాలని ఉన్నతాధికారులను కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ కోవలోనే పలువురికి స్థాన చలనం కూడా కల్పించారు. మరి కొంత మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించినా వారు విధుల్లో చేరుందుకు వెనకడుగు వేస్తున్నారు.

● అన్నీ ఇన్నీ కాదు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో భూసమస్యలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి మార్చడం, వివాదంలో ఉన్న భూములను ఒకరికి అనుకూలంగా మార్చడం, ఒకరి భూమిని మరొకరి పేర్లపైకి రికార్డులు ఎక్కించడం.. ఇలా అనేక భూ కుంభకోణాలు జిల్లాలో వెలుగుచూశాయి. మొదట్లో పొదలకూరు, వెంకటాచలం, నెల్లూరు రూరల్, కావలి, చిల్లకూరు, సైదాపురం, రాపూరు, కలువాయి వంటి మండలాల్లో అనేక భూఅక్రమాలు వెలుగు చూడగా, ఇటీవల ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు, వింజమూరు తదితర మండలాల్లో భూ అక్రమాలు ఎక్కువయ్యాయి. అందుకు ప్రధాన కారణం ఆ ప్రాంతాల్లో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుండడంతో భూములకు విలువ పెరగడమేనని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ సిబ్బంది రికార్డులు మార్చేసిన ఫలితంగా ఇరువర్గాల మధ్య తగాదాలు ఎక్కువైపోయాయి. అదే సమయంలో కోర్టు కేసులు కూడా విపరీతమయ్యాయి. గడిచిన నాలుగన్నరేళ్లలో జిల్లాలో 50 మందికిపైగా రెవెన్యూ సిబ్బందిపై వేటు పడింది. అందులో తహసీల్దార్లే ఎక్కువ. పలువురు రెవెన్యూ సిబ్బంది జైలుకు కూడా వెళ్లారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు భూ వ్యవహారాలను ముట్టుకునేందుకు భయపడుతున్నారని రెవెన్యూ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

చిన్నారులకు చుక్కల మందు
తప్పనిసరి : కలెక్టర్

- మూడురోజులపాటు కార్యక్రమం నిర్వహణ
- 98.02 శాతం విజయవంతం



నెల్లూరు జేవీఆర్ కాలనీ ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ హరినారాయణన్, పక్కన డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు (వైద్యం)మార్చి 3: చిన్నారులందరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఆదివారం నెల్లూరు నగరంలోని జేవీఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం నుంచి పోలియో మహమ్మారిని పూర్తిగా తరిమి కొట్టాలన్నారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను శిబిరాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లాలో 3 లక్షల మందికిపైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సెలీనాకుమారి, డాక్టర్ మౌనిక, డాక్టర్ రమేష్, డాక్టర్ కుసుమ, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● 98.02 శాతం పల్స్‌పోలియో విజయవంతం

జిల్లా వ్యాప్తంగా 98.02 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,93,536 మంది ఉండగా, 2,87,772 మందికి పోలియో చుక్కలు వేశారు. మొత్తం 2,396 బూత్‌లతోపాటు 65 మొబైల్ బూత్‌లు, 85 ట్రాన్సిట్ బూత్‌ల ద్వారా వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పోలియో చుక్కలు వేశారు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతోపాటు వైద్య విధాన పరిషత్ వైద్యాధికారులు కూడా పాల్గొని పల్స్‌పోలియో తీరును పరిశీలించారు.



మహిమలూరు ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి

- వేతనాలు అందక ఇక్కట్లు
- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

హరిత రాయబారుల
ఆకలి కేకలు

వరికుంటపాడు, మార్చి 3: సంపూర్ణ పారిశుధ్య కోసం నియమించిన హరిత రాయబారులు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. పంచాయతీలను బట్టి ఒక్కొక్కరికి ఏడెనిమిది నెలలుగా వేతన బకాయిలు ఉన్నాయి. దీంతో పూట గడవడం లేదని వారు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో చేసేదేమిక లేక కొంతమంది ఇతర పనులతో జీవనం సాగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

● పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

2018 అక్టోబరు 2న టీడీపీ ప్రభుత్వం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చింది. వాటి పరిధిలో హరితరాయబారులను నియమించింది. వారు నివాసాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించేవారు. ప్రతి నిత్యం గ్రామాలను శుభ్రంగా ఉంచే తమను ప్రస్తుత ప్రభుత్వం చిన్నచూపు చూడడం దారుణమని వారు మండిపడుతున్నారు. మురికి కూపాల్లో పనిచేస్తు అనారోగ్యాల బారిన పడుతున్నా, వైద్య ఖర్చులకు కూడా నగదు లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాలో సుమారు 1,700 పైబడిన హరిత రాయబారులను నియమించింది. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ. 6వేలు వంతున వేతనాన్ని వారి ఖాతాల్లో జమ చేసేది. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం ఆ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీలకు మంజూరు అయ్యే నిధులు కాస్తా విద్యుత్ బకాయిలు, అభివృద్ధి పనులకే సరిపోతుండడంతో వీరికి వేతనాలు అందించడం లేదు.



చెత్త సేకరిస్తున్న హరిత రాయబారులు(ఫైల్)

● బతుకు భారమై..

నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో అప్పులు తెచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి. కాగా పంచాయతీల్లో రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రాలీలు, రిక్షాలు, ఇతరత్రా వాహనాలు, యంత్రాలు ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వేతనాలు అందకపోవడంతో అంతంతమాత్రంగానే విధులు నిర్వహిస్తున్న హరిత రాయబారుల పుణ్యమా...అని వాటిని వినియోగించే పరిస్థితి లేకపోయింది.

● విధులకు ఎగనామం

నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మధ్యలోనే విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో పాటు చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు సైతం నిరుపయోగంగా మారాయి. పల్లెలో చెత్తను ఎత్తకపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. సకాలంలో వేతనాలు అందించాలని వేడుకొంటున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వారు జిల్లా అధికారులను కోరుతున్నారు.

అప్పులపాలయ్యాం...



నెలల తరబడి వేతనాలు అందకపోడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారడంతో అప్పులపాలయ్యాం. వేతనం వస్తుందనే ఆశతో చేసిన అప్పులు తలకు మించిన భారంగా మారాయి.

- ముంగర ఏసు, పెద్దిరెడ్డిపల్లి

టీడీపీ సీనియర్ నేత
రామానాయుడు కన్నుమూత

- వింజమూరు సమితి అధ్యక్షుడిగా సేవలు
- జొన్నలగడ్డ మృతికి పలువురి సంతాపం

కలిగిరి, మార్చి 3: టీడీపీ సీనియర్ నాయకుడు, వింజమూరు సమితి మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ రామానాయుడు(78) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. కాగా ఆయన స్వగ్రామమైన కలిగిరి మండలం సిద్ధనకొండూరుకు ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డి, ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్, కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, కొప్పర్తి నాగరాజు తదితరులు చేరుకుని రామానాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలో అందరితో పెద్దాయన అనిపించుకుంటూ, టీడీపీకి పెద్దదిక్కు అయిన రామానాయుడు మృతి తెలుగుదేశంపార్టీకి తీరని లోటని వారు పేర్కొన్నారు.



రామానాయుడు (ఫైల్)

● రామానాయుడు మరణం దిగ్ర్భాంతికరం

నెల్లూరు (వైద్యం) : వింజమూరు మాజీ సమితి అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నేత జొన్నలగడ్డ రామానాయుడు అకాల మరణం తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి ఉదయగిరి మెట్టప్రాంతానికి తీరని లోటన్నారు. 1981 - 87 వరకు వింజమూరు సమితి అధ్యక్షుడిగా ఆయన సేవలు అందించారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామన్నారు.

వైసీపీ ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే ఫొటో

అయోమయంలో అభిమానులు

మహీధర్ మార్గమేటు ?

కందుకూరు, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో కందుకూరు సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పోటీలో ఉంటారా.. లేక ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటారా ? అన్న ప్రశ్నలకు సమాధానం దొరక్క నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు అయోమయానికి గురవుతున్నారు. 'వైసీపీ ఫ్లెక్సీల్లో నా ఫొటో ఉండటానికి వీల్లేదు, జగన్ ఫొటోనే పెద్దది వేసుకోండి' అని వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌కు సుతిమెత్తగా మహీధరరెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆపార్టీ కీలకనేత విజయసాయిరెడ్డి వచ్చి కలిశాక ఆదివారం తెల్లవారేసరికి కందుకూరులో నిలువెత్తు మహీధర రెడ్డి ఫొటోలతో వైసీపీ ఫ్లెక్సీలు కనిపించడం చర్చనీయాంశమైంది. విజయసాయిరెడ్డితో మహీధరరెడ్డికి ఉన్న సత్సంబంధాల వల్ల కాదనలేక ఆయన అడిగేసరికి సరే అన్నాడా.. లేక వ్యూహాత్మకంగానే తన ఫొటో వేసుకోనిచ్చాడా..? అని ఆయన అనుచరులు తర్జనభర్జన పడుతున్నారు. వైసీపీతో సర్దుకుపోయేధోరణితో ఎమ్మెల్యే ఉన్నాడా...? అనే అనుమానాలు కూడా రేకెత్తించాయి. అయితే ఆదివారం తనను కలిసి అభిమానులతో మహీధర్ మాట్లాడుతూ 'రెండురోజులు ఓపిక పట్టండి, ఏమి జరుగుతుందో చూడండి. నా నిర్ణయం కోసం ఎదురుచూసేవారే నావారు. ఓపికలేకుండా వెళ్లేవారు వెళ్లనివ్వండి' అని అన్నారు. అయితే సిటింగ్ ఎమ్మెల్యే తప్పక పోటీలో ఉంటారని, అది ఏపార్టీ అనేది నిర్ణయం జరగాల్సి ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే మహీధరరెడ్డి ఆ సస్పెన్స్‌కు త్వరగా తెరదించితే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

సర్వం.. ప్లాస్టిక్ మయం !

- ఎక్కడా కానరాని నిషేధం
- గ్రామాలు, పట్టణాల్లో విచ్చలవిడిగా వ్యర్థాలే...
- అరికట్టడంలో ప్రభుత్వం విఫలం
- వాడకం కొనసాగితే భవిష్యత్ తరాలకు ముప్పు
- హెచ్చరిస్తున్న పర్యావరణ నిపుణులు



నదీ తీరంలో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అల్లూరు, మార్చి 3 : ప్లాస్టిక్ వినియోగం మానవ జీవనశైలిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ప్రకృతిలోని జీవరాశులను అంతమొందించేది ఏ ప్రళయమో.. భూకంపమో.. అను కుంటే పొరపాటు. మానవుడు విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులే అతని వినాశానికి కారణమవుతున్నాయి. గత పదేళ్లుగా ప్లాస్టిక్ మానవ జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నది. ఈ క్రమంలో ప్లాసిక్ వినియోగాన్ని నిషేధిస్తామని ప్రభుత్వం చెప్పే మాటలు ప్రకటనలే పరిమితమయ్యాయి. నేడు గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తాయి. వాడకాన్ని ఇలానే కొనసాగిస్తే భవిష్యత్తు తరాలకు ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ప్లాస్టిక్‌దే పైచేయి..

గతంలో కాటన్, లెదర్ సంచులు, వెదురు బుట్టలు తదితర వాటిని వినియోగించేవారు. కానీ ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగానికి పైచేయిగా ఉంది. మానవుడి జీవన సరళికి అనుగుణంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. వీటిలో గృహాల్లో ఏర్పడే వ్యర్థాలను అందులో నింపి మళ్లీ రోడ్డుపైనే పడేస్తున్నారు. ఆ ఆహార వ్యర్థాలను పశువులు కవర్లతోసహా తినడంతో వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి మరణానికి దారి తీస్తున్నాయి. అంతేకాక భూమిలో, నీటిలో ప్లాస్టిక్ సంచులు చేరి ప్రాణులకు, చెట్లకు హాని చేస్తున్నాయి.



చెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు, పందులు

దీంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను నాశనం చేయలేమని తెలిసి కూడా కొంతమంది వాటిని కాల్చేస్తుంటారు. వీటి నుంచి వెలువడే పొగలో పలు విషపూరితమైన వాయువులు గాలిలో కలిసి జీవరాశికి ముప్పు తెచ్చిపెడుతున్నాయి. వీటిలో ముఖ్యంగా నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, వోలటైన్ ఆర్గానిక్ కెమికల్స్ కాల్చగా మిగిలిన పదార్థాన్ని పాలిసైక్లిక్ ఆర్గానిక్ మ్యాటర్ అంటారు. అంతేకాకుండా హెవీమెటల్స్ డై ఆక్సిన్ అనే విషపూరిత వాయువులు వెలువడుతాయి. వీటి వల్ల శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

● ప్లాస్టిక్‌లో రకాలు

ప్లాస్టిక్‌లో ఐదు రకాలను వర్గీకరించవచ్చు. మొదటిది పాలిథిలిన్. దీన్ని షాపింగ్ బ్యాగ్స్, ధాన్యం నిల్వ చేసే సంచుల తయారీకి ఉపయోగిస్తారు. రెండోది పాలివినైల్ క్లోరైడ్ (పీవీసీ) దీన్ని బాటిల్స్, కంటైనర్స్ తయారీలో వినియోగిస్తారు. మూడోది పాలిథిలిన్ టెరిథాలేట్ (పీఈటీఈ) దీన్ని బేవరేజ్ బాటిళ్ల తయారీలో వినియోగిస్తారు. నాలుగోది పాలిస్టెరిన్ (పీఎస్) లైట్ స్పాంజ్ మెటీరియల్, మాంసం, గుడ్లు పెట్టుకునే ట్రేల తయారీకి వినియోగిస్తుంటారు. ఐదవది పాలి ప్రొపిలిన్ (పీపీ) స్ట్రాలు, పెరుగు, మజ్జిగ నిల్వ చేసుకునే ప్రత్యేక బ్యాగ్‌లను తయారీకి వినియోగిస్తారు. ఇవన్నీ కూడా ఒకసారి వినియోగించి పక్కన పడేసేలా ఉంటాయి.


● ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి

ప్లాస్టిక్ వినియోగం తగ్గించి సమాజాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలి. వ్యాధులు రావడానికి ప్లాస్టిక్ వ్యర్థాలే 50 శాతం కారణమనే విషయాన్ని మనం ఎందుకు గ్రహించడం లేదు. ప్లాస్టిక్ కవర్లు వాడకాన్ని 0 శాతానికి చేర్చినప్పుడే కొంతవరకు కాలుష్యాన్ని నిలువరించగలుగుతాం. చెట్లను కాపాడడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గినపుడే స్వచ్ఛమైన ప్రకృతిని సాధించగలమని నిపుణులు పేర్కొంటున్నారు.

● నిషేధంలో ప్రభుత్వం విఫలం

ప్లాస్టిక్ వినియోగం ప్రస్తుత మానవాళితోపాటు భావితరాల వారికి పెనుముప్పును తీసుకొస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఈ దిశగా ప్లాస్టిక్‌ను నియంత్రించడం, నిషేధించడం ప్రభుత్వం బాధ్యత. అయితే రాష్ట్రంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిస్తామని చెప్పిన ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలతో తీవ్ర ప్రమాదం ఉన్నప్పటికీ వాటిని నిషేధిస్తామని ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో ఎ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. క్షేత్రస్థాయిలో అధికారులు దుకాణదారులపై దాడులు చేసి, జరిమానా విధిస్తున్నారేతప్ప ఇతర చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మళ్లీ యథా విధిగా ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది.

పరోక్ష విషం



ప్లాస్టిక్ సంచులు, వస్తువులు జీవరాశులకు పరోక్ష విషంగా భావించవచ్చు. వీటిని వాడడం వల్ల భావితరాలకు ముప్పు పొంచి ఉంది. ప్లాస్టిక్‌ను నివారించకుంటే భవిష్యత్‌లో జీవనం కష్టమే.

- ఆల్తూరు వెంకట సుకుమార్‌రెడ్డి, అల్లూరు

పర్యావరణానికి ముప్పు



ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. ప్రతి వస్తువు మట్టిలో కలిసిపోతోంది. అయితే ప్లాస్టిక్ మాత్రం ఎట్టిపరిస్థితుల్లో మట్టిలో కరగదు. దీని వాడకాన్ని నిలువరించగలిగితే ప్రకృతిని కాపాడుకోవచ్చు.

- కొప్పు శ్రీనివాసులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, అల్లూరు

సంస్కరణలపై సమీక్షలేవి?

- విద్యారంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెల్లూరు(స్టోన్‌హౌ‌స్‌పేట), మార్చి 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా?, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతోంది? వంటి అంశాలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు కోరారు. నెల్లూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం వీవీ శేషులు అధ్యక్షతన జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని బాలబాలికలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తామంటూ రెండేళ్ల క్రితం సంస్కరణలు ప్రారంభించిన ప్రభుత్వం ఆ తర్వాత వాటి అమలుపై కనీసం సమీక్షించడం లేదని ఆరోపించారు. 14 వేల ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, అక్కడి పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందా.. అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ఇంగ్లీషు మీడియం బోధన కోసం ఒక్కో స్కీము ప్రవేశపెడుతున్నారని, ఒక సంవత్సరం ప్రవేశపెట్టిన స్కీమ్ పురోగతి ఏమిటో చర్చించకుండానే మరో స్కీమ్ ప్రవేశపెట్టడం వలన ఫలితం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలని ప్రశ్నించారు. 4600 ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను స్థానికంగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారని, ఆ తర్వాత విద్యార్థులకు ఎలాంటి విద్య అందుతోందనే సమీక్ష లేకపోవడం సరికాదన్నారు. గతేడాది 294 పాఠశాలల్లో ప్లస్ 2 ప్రవేశ పెట్టారని, దీనిలో ఎంత మంది విద్యార్థులు చేరారు, ఎంత మంది పాసయ్యారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, జిల్లా కార్యదర్శులు కే నాగిరెడ్డి, గంగాధర్, తిరుపతయ్య, ఖాజావలి, సురేంద్రబాబు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలుకే మా ఓటు

- రాజకీయ పార్టీలకు యూటీఎఫ్ నేతల వినతి



టీడీపీ నేతలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, మార్చి 3: ఎవరైతే సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తారో వారికే మా ఓట్లు వేస్తామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావు తెలిపారు. ఆదివారం టీడీపీ సీపీఎం, జనసేన నాయకులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఆత్మకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామ్మోహనరావు, షేక్ ఖాదర్‌బాష, గౌరవాధ్యక్షులు హరికృష్ణ, మురళీకృష్ణ, పాల్గొన్నారు.

వేమిరెడ్డిని కలిసిన మురళీ కన్నబాబు



వేమిరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న గూటూరు కన్నబాబు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 3 : ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గూటూరు మురళీ కన్నబాబు ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

సైదాపురం, మార్చి3: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఫోక్సో కేసులో ముద్దాయి షేక్ మస్తాన్ బాషాను ఆదివారం ఎస్ఐ విజయ్‌కుమార్ అరెస్టు చేశారు. అనంతరం అతన్ని కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

యువకుడికి విద్యుదాఘాతం


- మరమ్మతులకు ప్రైవేటు వ్యక్తి
- స్తంభం పైనుంచి పడి గాయాలు
- ఐదు నెలల్లో రెండో ఘటన



చికిత్స పొందుతున్న రవి

నెల్లూరు రూరల్, మార్చి 3 : విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగులు చేయాల్సిన మర్మమతులు ప్రైవేట్ వ్యక్తులతో చేయించడం వల్ల వారు ప్రాణాంతక పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మండలంలోని పాతవెల్లంటిలో ఆదివారం ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు... విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడటంతో గ్రామానికి చెందిన పాదర్తి రవి (35) అనే ప్రైవేట్ వ్యక్తిని సచివాలయ విద్యుత్ శాఖ ఉద్యోగి మరమ్మతుల నిమిత్తం స్తంభం ఎక్కించాడు. సౌత్‌మోపూరు సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఆపామని చెప్పడటంతో రవి వైర్లు పట్టుకున్నాడు. అందులో విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురై స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. స్థానికులు అతడిని హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రవికి తీవ్రగాయాలయ్యాయని అయితే ప్రాణాపాయ పరిస్థితి తప్పిందని వైద్యులు చెప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కాగా, సచివాలయ విద్యుత్ శాఖ ఉద్యోగి ఒక లైన్ ఆపమని చెప్పగా సబ్‌స్టేషన్‌లోని సిబ్బంది మరో లైన్ ఆపినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. 5 నెలల క్రితం సజ్జాపురం వద్ద జరిగిన ఇలాంటి ఘటనలో కొత్తవెల్లంటికి చెందిన మల్లికార్జున్ అనే ప్రైవేట్ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ శాఖ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించకుండా ప్రైవేట్ వ్యక్తులతో మరమ్మతుల చేయించడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోటారు బైక్ బోల్తా : యువకుడి మృతి



మృతి చెందిన దుర్గయ్య

వరికుంటపాడు, మార్చి 3: గొల్లపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో ఆదివారం వేగంగా వెళ్తున్న మోటారు బైక్ బోల్తా పడడంతో కాంచెరువు ఎస్టీ కాలనీకి చెందిన జయంబు దుర్గయ్య(25) అక్కడికక్కడే మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తోటలచెరువుపల్లి లోని మామిడి తోటలో కాపలా దారుడిగా జీవనం సాగించేవాడు. పని నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో ఈ దుర్ఘటన జరిగింది. మృతుడికి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6063
వెండి కిలో ధర	రూ. 72,900
వెండి ఒక గ్రాము	రూ. 74.90

ఉదయగిరిలో పేకాట జోరు

ఉదయగిరి, మార్చి 3: పట్టణశివారు ప్రాంతంలో పేకాట జోరుగా సాగుతోంది. బిజ్జంపల్లి రోడ్డు, దుర్గంపల్లి, వెంకటంపేట మలుపు, సున్నంవారిచింతల కొండ మలుపు, సర్వరా బాదు జామాయిల్ చెట్లు, దాసరిపల్లి తదితర ప్రాంతాల్లో నిత్యం పేకాట జోరుగా సాగుతోంది. కొందరు స్థానికులు పామూరు, బద్వేలు, నందిపాడు, సీతారామపురం, కుర్రపల్లి తది తర ప్రాంతావాసులతో నిత్యం పేకాట నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల వద్ద మద్యం, భోజ నాలు ఏర్పాటు చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. సంబంధిత అధికారులకు నెలవారి మామూళ్లు ముట్టచెబుతుండటం వల్లే దాడులు జరుగడం లేదని విమర్శలున్నాయి. పేకాట కేంద్రాల వద్ద ఘర్షణలు జరుగుతున్నాయని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సొంతిల్లు.. పెనుభారం!

- ఆకాశాన్నంటుతున్న సిమెంట్, ఇనుము ధరలు
- అదేస్థాయిలో కంకర, గ్రానైట్ రేట్లు
- ఇసుకకూ ఇక్కట్లే...!
- అర్ధంతరంగా ఆపేస్తున్న నిర్మాణదారులు

సంగం, మార్చి 3: ఆకాశాన్నంటుతున్న ఇంటి నిర్మాణ సామగ్రి ధరలతో ప్రజలకు సొంతింటి కల పెనుభారంగా మారింది. పెరిగిన ధరలతో పలువురు ఇంటి నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ చేపట్టినా మధ్యలో నిలిపివేస్తున్నారు. సిమెంట్, ఇసుక, ఇనుము, కంకర, చిప్స్, ఇటుక తదితర సామగ్రి ధరల స్థిరీకరణ లేదు. ఏరోజుకారోజు పెరుగుతూనే ఉన్నాయి. ముడి సరుకుల ధరలను సాకుగా చూపి ఉత్పత్తి సంస్థలు రేట్లు పెంచుతున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి కృత్రిమ కొరత సృష్టించి దోచుకుంటున్నారు. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులతో ధరలు పెరిగి నిర్మాణదారులపై ఆర్థిక భారం పడింది.

● అసంపూర్తిగా నిర్మాణాలు

ప్రస్తుతం సిమెంట్ బస్తా రూ. 350. టన్ను ఐరన్ రూ. 60 వేలకు పైమాటే, ట్రాక్టరు ఇసుక గ్రామీణ ప్రాంతాల్లో రూ. 3,500, పట్టణాల్లో రూ. 5వేల పైమాటే. దీంతో గృహ నిర్మాణం భారమవుతోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. దీంతో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా నిలిపివేస్తున్నారు. ఇకపోతే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అన్నది ప్రజలకు అందని ద్రాక్షలా మిగిలింది. జిల్లా అవసరాలకు తగ్గట్లు ఇసుక సరఫరాలేదు. ఎప్పటికప్పుడు ఇసుక పాలసీలను ప్రకటించినా మాఫియాల ఆగడాలకు అడ్డుపడడం లేదు. ఇటీవల ప్రభుత్వం ఇసుక పాలసీని ప్రకటించింది. వారం వారం ప్రతికల్లో ఇసుక ధరలను ప్రకటిస్తూనే ఉంది కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఎక్కడా ఆశించిన స్థాయిలో ఇసుక లభ్యత లేదు. జిల్లాలోని పెన్నానదిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అయితే జగనన్న కాలనీ లేఅవుట్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాల పేరిట ఇసుక తరలించుకుపోతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా పనులు జరుగుతున్న దాఖలాలు లేవు.



అర్ధంతరంగా ఆగిన జగనన్న కాలనీ ఇళ్లు

● పన్నుల పెంపు

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాల నిర్మాణ సామగ్రిపై భారీగా పనులు పెంచింది. వీటికి తోడు క్వారీలపై సీనరేజ్‌లతోపాటు ఇతర ఫీజులనూ పెంచింది. దీంతో క్వారీల వద్ద రూ. 12 వేలకు లభించే కంకర లోడు రూ. 18 వేలకు పెరిగింది. గతంలో ఉచితంగా లభించే ఇసుక ప్రభుత్వమే టన్ను ఇసుక రూ. 475లు. దీనికితోడు గుత్తేదారులు బాటల పేరుతో అక్రమ వసూలు కలిపి ట్రాక్టర్ ఇసుక తడిపిమోపెడవుతుంది. జీఎస్టీ రేట్లతో సిమెంట్, ఐరన్ రేట్లు పరిస్థితి ఇంతే.

● నిలిచిన జగనన్న కాలనీలు

పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది కాలనీలను మంజూరు చేసింది. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 1.8 లక్షలు కేటాయించింది. పెరిగిన ఈ ధరలతో నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వమే కట్టిస్తుందని ఆ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించింది. పెరిగిన ధరలతో కాంట్రాక్టర్లు బేస్‌మెంట్ వరకు నిర్మించి నిలిపేశారు. దీనికితోడు సక్రమంగా బిల్లులు విడుదల కాకపోవడంతో వాటిని అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో జగనన్న లే అవుట్లు సమాధుల్లా దర్శనమిస్తున్నాయి.

భారీగా పెరిగిన ధరలు



ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. ఇసుక, సిమెంట్, ఐరన్, ఇటుక కొనేటట్లు లేదు. దీనికితోడు బేల్దారి కూలీలు కూడా పెరిగాయి. ప్రతిది రెండు రెట్లు పెరిగింది. ఇంటి నిర్మాణం చేపట్టాలంటే భయంగా ఉంది. పెరిగిన ఈ రేట్లతో ఇంటి నిర్మాణం పూర్తి చేయలేక శ్లాబ్ వరకు వేసి వదిలేశా.

- షేక్ బాబు, గృహ నిర్మాణదారుడు, తలుపూరుపాడు

నెల్లూరుకు చేరుకున్న ప్రచార రథాల యాత్ర



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న అబ్దుల్ అజీజ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 3: రాబోవు ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయమే లక్ష్యంగా ప్రవాస భారతీయుడు కొట్టే ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రచార రథాల యాత్ర ఆదివారం నెల్లూరు నగరానికి చేరుకుంది. శ్రీ సత్యసాయి విద్యాసంస్థల అధినేత చామకూరు హరిగోపాల్ ఆధ్వర్యంలో ప్రచార రథాల యాత్రకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పొంగూరు నారాయణ విజయాన్ని ఆకాంక్షిస్తూ నగరంలోనిమూడవ డివిజన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఎన్‌ఆర్ఐ కొట్టే ఉదయభాస్కర్ ప్రయత్నం అభినందనీయమన్నారు. హరిగోపాల్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా నారాయణను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు రవికుమార్, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవికి ముందే తాగునీటికి తిప్పలు

- కటకటలాడుతున్న మర్రిపల్లి గిరిజనులు



మరమ్మతుకు గురైన మర్రిపల్లి గిరిజన సంఘంలోని చేతిపంపు

పొదలకూరు, మార్చి 3: వేసవి ఆరంభానికి ముందే మండలంలోని మర్రిపల్లి గిరిజన సంఘం వాసులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. పొదలకూరు పట్టణానికి ఆనుకుని ఉన్న మర్రిపల్లి గిరిజన సంఘంలో సుమారు 100 కుటుం బాల వారు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ గిరిజన సంఘంలో ఉన్న రెండు చేతి పంపులు మరమ్మతులకు గురై మూడు నెలలైనా మరమ్మతులు చేయకపోవడంతో నీటికోసం కటకటలాడాల్సి వస్తోంది. ఈ ప్రాంతం వాళ్లకి పంచాయతీ నీళ్ల కుళాయిలకు సక్రమంగా ఎక్కడంలేదు. దీంతో కుళాయిలకు కొందరు మోటార్లు అమర్చుకుంటున్నారు. వారందరూ మోటార్లు ఆపితే కాని తమ కుళాయిలకు పంచాయతీ నీళ్లు ఎక్కవని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మర్రిపల్లి గిరిజన సంఘం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమ ప్రాంతంలో ఉన్న రెండు చేతిపంపులకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

ఏపీజీఈఏ కార్యవర్గం ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీజీఈఏ కార్యవర్గం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 3 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బీ సుధాకర్‌రెడ్డి(వైద్యఆరోగ్య శాఖ), కార్యదర్శిగా పీవీఎస్‌టీ రాం ప్రసాద్ (అర్థగణాంక శాఖ), సహాధ్యక్షులుగా డాక్టర్ సీ అమర్‌నాథ్‌రెడ్డి (వైద్యఆరోగ్య శాఖ), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్ చక్రవర్తి(న్యాయ శాఖ), కోశాధికారిగా ఎం రమేష్ (నీటిపారుదల శాఖ) ఎన్నికయ్యారు. పలుశాఖల నుంచి ఏడుగురు ఉపాధ్యక్షులుగా, ఏడుగురు సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికైనారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీ నాగసాయి, పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఏనుగ రమణారెడ్డి, మాజీ కార్యదర్శి మల్లికార్జునను ఘనంగా సత్కరించారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం : డేగా



తాటిపర్తిలో బహుజనుల చైతన్యయాత్ర

పొదలకూరు, మార్చి 3 : బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యమని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఫోరం జాతీయ అధ్యక్షుడు డేగా రవిరాఘ వేంద్రఅన్నారు. ఆదివారం పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో జరిగిన బహుజనుల చైతన్య రథయాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత పాండు రంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఏనాడు రాజ్యాధికారం కట్టబెట్టలేదన్నారు. బహుజ నులు బలమైన రాజ్యాంగ శక్తిగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఉపాధ్య క్షుడు వేగూరు విజయకుమార్, మాకాని వెంకటేశ్వర్లు, కుడుముల సుబ్బారావు, పొట్టేళ్ల పెంచలయ్య యాదవ్, దుర్గంపాటి పద్మజ, నేలపాటి జితేంద్ర, మర్రి చెంచయ్య, కొప్పాల అశోక్, కుంచం ప్రసాద్, ఉద్దాల మణికుమార్, గూడూరు గోపాల్, కోడూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

వెంకటాచలం, మార్చి 3 : మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి చోరీచేసిన సంఘటన మండలంలోని ఎర్రగుంటలో ఆదివారం జరిగింది. ఎర్రగుంట గ్రామానికి చెందిన లూర్దు మేరీ నివాసంలో ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని వ్యక్తి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న 6 సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వకర్మ యోజన జిల్లా కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



బైరి శ్రీనివాస్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 3: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు సంబం ధించి జిల్లా కమిటీ సభ్యుడిగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ నియమితులయ్యారు. అంతరించిపోతున్న చేతివృత్తులను, కనుమరుగైపోతున్న సంప్రదాయ వృత్తులను కాపాడుతూ ఆ కుటుంబాలను ఆర్థి కంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో విశ్వకర్మ పథకాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి కళాజాతా

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 3 : ఓటు వేద్దాం - ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై రాష్ట్ర స్థాయి కళాజాతా సోమవారం జరుగుతుందని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. నెల్లూరులోని టౌనుహాలులో సాయంత్రం 5గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వీ లక్ష్మణరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నేత జీ మాల్యాద్రి హాజరవుతారని, ప్రజాస్వామ్య పరిరక్షకులు అందరూ తరలిరావాలని కోరింది.



పరిశీలిస్తున్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర

మహిళల ఆర్థిక స్వావలంబనకే మహిళా మార్టు

- మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర

కావలిటౌన్, మార్చి 3: మహిళల ఆర్థిక స్వావలంబనకే మహిళా మార్టుల ఏర్పాటు అని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ప్రారంభం కానున్న మహిళా మార్టును, అక్కడి ఏర్పాట్లను ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా మార్టుల ఏర్పాటును చేపట్టిందని, మహిళలు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళా మార్టు నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం భారతి, సీవోలు ఝాన్సీ, కొండయ్య, అరుణకుమారి, సునీత పాల్గొన్నారు.

వైసీపీ నేతల తీరుతో నీటి పారుదలకు ఆటంకం!

- రోడ్డు పగలగొట్టి తూములు తొలగించిన రైతులు



తాళ్లపాలెం వద్ద తూములో పూడిక తీస్తున్న జువ్విగుంటపాలెం రైతులు

కావలి రూరల్, మార్చి 3: అధికార వైసీపీ నేతల తీరుతో సాగునీటి పారుదలకు తీవ్ర ఆకంటం ఏర్పడింది. దీంతో ఆగ్రహించిన రైతులు రోడ్డును పగలగొట్టి తూములు తొలగించారు. వివరాల మేర కు... కావలి మండలం తాళ్లపాలెంలో నూతన సచివాలయ భవనానికి వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి లేదు. దీంతో స్థానిక అధికార వైసీపీ నేతలు అనాలో చితంగా తాళ్లపాలెం పంచాయతీ జువ్విగుంటపాలెం, శింగిరిగిరివారిపాలెం పరిధిలోని సుమారు 1000 ఎకరాలకు తాళ్లపాలెం చెరువు నుంచి సాగునీరు సర ఫరా జరిగే కాలువకు 3 ఏళ్ల కిత్రం చిన్నపాటి తూ ములు ఏర్పాటు చేసి, కాలువ కొంతభాగం పూడ్చి వేసి దానిపై సీసీ రోడ్డు నిర్మించారు. ఆ తూములు కింద మట్టి కూరుకుపోవడంతో చెరువులో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు నీటి సరఫరా సజావుగా సాగినా చెరువులో నీరు తగ్గినప్పుడు సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం జువ్విగుంటపాలెం రైతులు ఎక్స్‌కవేటర్‌తో తూములను తొలగించి పూడిక తీసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేతల తీరుతో రైతులకు అగచాట్లు తప్పలేదని, చివరి దశలో నీరందక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని రైతులు వాపోయారు.

అలరించిన చిన్నారుల నాట్య ప్రదర్శన



ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ఆదివారం 150 మంది కళాకారులతో నిర్వహించిన కూచిపూడి భరత నాట్య ప్రదర్శన భక్తులను అలరించింది. విజయవాడ మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమి వారి అరుణ కల్యాణి శ్రీకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో చిన్నారులతో నిర్వహించిన శ్రీకామాక్షి మల్లికార్జున స్వామి నృత్య నీరాజనం కార్యక్రమం భక్తులను అలరించింది. నాట్య ప్రదర్శన అనంతరం కళాకారులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, స్వామి, అమ్మవార్ల ప్రసాదములు అందజేశారు. ఆలయ ఈఓ వి. గిరికృష్ణ పర్యవేక్షించారు.

నేటి నుంచి పదో తరగతి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 3: ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈఫీల్డ్(స్ట్రీమ్, జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేది) ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్ టిక్కెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పాఠశాల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వెబ్‌సైట్‌లో యూజర్‌పేరు వద్ద స్కూల్ కోడ్ నమోదు చేయాలని, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పాఠశాలల నుంచే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడం సురక్షితమని తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగుల ఎన్నికలు

నెల్లూరు (లీగల్), మార్చి 3 : నెల్లూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా వై సురేష్ బాబు 47 ఓట్లతో, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే దీపక్ 30 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జనరల్ సె క్రటరీగా పీవీ నారాయణరెడ్డి, కోశాధికారిగా కేవీ సునీల్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎంవీ శివకుమార్, ఉపాధ్యక్షులుగా వీ వెంకటేశ్వర్లు, సీహెచ్ పోలయ్య, ఏకే షఫీ, సీహెచ్ వెంకటేశ్వ ర్లు, జాయింట్ సెక్రటరీలుగా బీ సురేంద్రబాబు యాదవ్, బీ దినేష్ కుమార్, ఎస్ శివయ్య, ఏ మల్లికార్జున ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు కే నరసింహారావు, టీ రవికుమార్ వ్యవహరించారు.

సమష్టి కృషితో పోలియో నివారణ


కావలిటౌన్ : పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత


ఉలవపాడులో..

కావలిటౌన్, మార్చి 3: సమష్టికృషితో పోలియో నివారణ సాధ్యమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత పేర్కొన్నారు. ఆదివారం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కావలి డివిజన్‌లో 520 బూతులలో, బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో, మొబైల్ వాహనం ద్వారా పిల్లలకు చుక్కలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సహాయ అధికారి శివకుమార్, డాక్టర్ రజిని, ఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కందుకూరు: పట్టణ పరిధిలో 35కేంద్రాలు, మొబైల్ వాహనం ద్వారా 5457మంది చిన్నారులకు పోలియోచుక్కలు


కందుకూరులో...

వేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ శకుంతల కార్యక్రమాన్ని ప్రారంభించగా వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, జువేరియాభాను, రాకేష్, సీహెచ్ఎన్ పద్మావతి, శోభ, సుధాకర్ పర్యవేక్షించారు.

లింగసముద్రం : 16 గ్రామ పంచాయతీలలో 3014 మంది చిన్నారుల్లో 2894 మందికి చుక్కలు వేసి 97.64 శాతం పూర్తిచేసినట్లు లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమేష్ తెలిపారు. మిగిలిన 120మందికి సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి తిరిగి వేస్తారని చెప్పారు.

ఉలవపాడు : మండలంలో 97 శాతం పూర్తి చేసినట్లు కరేడు, చాకిచర్ల సెక్టార్ల వైద్యాధికారులు తెలిపారు. కరేడు పీహెచ్‌సీ పరిధిలో 3251మందికి 23బూత్‌లలో 2980మందికి డాక్టర్ కే శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలియో చుక్కలు వేశారు. చాకిచర్ల పీహెచ్ పరిధిలో డాక్టర్ సింధుప్రియ పర్యేక్షణలో 2876మంది పిల్లలకు 22 పోలియో బూత్‌ల్లో 2798 మందికి చుక్కలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

బిట్రగుంట: కోవూరుపల్లి పీహెచ్‌సీ, జువ్వలదిన్నె పరిధిలో 98శాతం పోలియో చుక్కలు పూర్తి చేసినట్లు వైద్యులు పి.జిహారిక, రాజశేఖర్ తెలిపారు. మండలంలో 5178 మంది చిన్నారులకు 53పల్స్‌పోలియో కేంద్రాలతో 5106 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సులోచన, ఎఫ్ఎస్‌మేరీ, విక్టోరియారాణి, కృష్ణమూర్తి, వసంత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: 15 గ్రామ సచివాలయాల పరిధిలో


లింగసముద్రంలో...

3963మంది పిల్లలుండగా 3935 మందికి చుక్కలు వేసి 96.72 శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి మణిదీపిక తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, శివ, మణిదీపిక, సీహెచ్‌వో శివరామయ్య, సర్పంచులు అనుమోల అమరేశ్వరి, ఇరపని సతీష్, డేగా వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు గురిజాల క్రిష్ణయ్య, పరిటాల వీరాస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూరు: మహిమలూరు ప్రాథమిక పాఠశాలలో కేంద్ర రక్షణశాఖ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి వైద్యాధికారులతో కలిసి పల్స్ పోలియోను ప్రాంభించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి, డివిజన్ ప్రోగాం ఆఫీసరు డాక్టర్ సుధీర్‌కుమార్, మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, సర్పంచ్ చంద్రశేఖర్‌రావు, ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు. ఆత్మకూరులో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్బన్ ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి షేక్ అస్మా, ఎంపీహెచ్‌వో సిద్ధం సుధాకర్ పాల్గొన్నారు.

సంగం: పల్స్ పోలియో 97 శాతం విజయవంతమైనట్లు వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 3,543 మంది చిన్నారుల్లో 3,443మందికి చుక్కలు వేశామన్నారు.

మర్రిపాడు: బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యుడు గోపినాథ్ ఉన్నారు.

అనంతసాగరం: వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, శ్రావణి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

సీతారామపురం: మండలంలో 98.7 శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యురాలు స్వప్న తెలిపారు. బస్టాండ్ సెంటర్‌లో ఒక బూత్, మొబైల్ కింద బూత్ ఉపయోగించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, ఎంపీహెచ్ ఈవో అబ్దుల్ మజీద్, ఎంపిహెచ్ఎస్ రియాజ్ పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): 98.4శాతం మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు వైద్యాధికారి అయాబ్‌అప్సర్ తెలిపారు. మండల కేంద్రం లో ఎస్ఐ ఉమాశంకర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సీహెచ్‌వో ఒంకారయ్య, హెచ్‌ఈ బీబీజాన్, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

ఏఎస్ పేట: పల్స్‌పోలియోను 100శాతం పూర్తి చేయాలని పల్స్ పోలియో రాష్ట్ర అబ్జర్వర్, డిప్యూటీ డైరెక్టర్ శివ శంకర్ బాబు తెలిపారు. చిరమణ పీహెచ్‌సీలోని హసనపురంలో పోలియో కార్యక్రమన్ని పరిశీలించి, ట్యాలీ షీట్స్ తనిఖీ చేశారు. 97శాతం పూరైనట్లు వైద్యులు తెలిపారు.

ఉదయగిరి: గండిపాళెం ప్రాథమిక కేంద్రం, ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో గండిపాళెం వైద్యాధికారిణి శివకల్పన చిన్నారులకు చుక్కలు వేశారు.

వరికుంటపాడు: మండలంలో 97శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు కరిష్మా, ఆయేషా తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖరరాజు, పీహెచ్ఎస్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ వెంకటయ్య, హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలకేంద్రంతో పాటు జర్ల, చిత్తలూరు పరిదిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు వైద్యాధికారులు మెహబత్, నవీన్, జ్యోతి తెలిపారు.

వింజమూరు: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని డాక్టర్ మురళీధర్‌రావు ప్రారంభించారు. 96శాతం పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.


వలేటివారిపాలెంలో...


దుత్తలూరులో..ఎస్ఐ ఉమాశంకర్


సీతారామపురం:చుక్కలు వేస్తున్న డాక్టర్ స్వప్న


బిట్రగుంటలో...


ఆత్మకూరులో కమిషనర్ షేక్ ఫజులుల్లా


అనంతసాగరంలో...


చేజర్ల : చిత్తలూరులో..


మర్రిపాడులో..


ఏఎస్ పేట : హసనాపురం కేంద్రాన్ని పరిశీలిస్తున్న పల్స్ పోలియో డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు


వరికుంటపాడులో...

వలస వాసుల ఆత్మీయ సమావేశం

ఉదయగిరి రూరల్: బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లోని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం నియోజకవర్గం నుంచి వలస వెళ్లిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేక పాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన్ను, ఇతర నేతలను వలసవాసులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, యువ నాయకుడు మేకపాటి అభినయ్‌రెడ్డి, జీ.ఓబులరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, అలీఅహ్మద్ పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, మార్చి 3: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు సభ్యులు ఆదివారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. శివరాత్రి అనగా కర్మ నాశనం జరిగితే కలిగే మోక్షంకు గుర్తుఅని, అందుకే శివరాత్రిని మోక్షరాత్రి అని అంటారన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర్లు, నరసింహులు, నాగమ్మ, రమణమ్మ, భరత్‌కుమార్, రమణయ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకుంటారా..?


మరుగుదొడ్లు తొలగించిన తర్వాత ఖాళీస్థలం

చేజర్ల, మార్చి 3: కొలపనాయుడు పల్లిలో ఎస్ఎస్ఏ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను శనివారం స్థానిక వైసీపీ నాయకుడు తొలగించి, ఆ స్థలాన్ని ఆక్ర మించిన నేపథ్యంలో సదరువ్యక్తిపై చర్య లు తీసుకుంటారో లేదో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ స్థలం ఆక్రమణలపై ఫిర్యాదు చేశామని అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేదికాదని అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. అసలు ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు తొలగించాలంటే పంచాయతీ, మండల తీర్మానాలు తప్పనిసరిగా ఉండాలని తెలియదా అని చర్చించుకుంటున్నారు. ఆదివారం అందుబాటులో లేని అధికారులు సోమవారం ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలంటున్నారు.

భీమేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు


భీమేశ్వరాలయంలో ధ్వజారోహణ నిర్వహిస్తున్న పూజారులు

సంగం, మార్చి 3: వంగల్లులో వెలసిన కామాక్షిదేవి సమేత భీమేశ్వరాలయంలో శనివారం అర్ధరాత్రి ధ్వజారోహణ చేపట్టడంతో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమైయ్యాయి. మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య నడుమ ధ్వజారోహణ నిర్వహించారు. ఉత్సావాలు ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ వేడుకల్లో కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి రోజుకోక వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అందులో భాగంగా ఆదిరాత్రి శేషవాహనం దర్శనమిచ్చారు.

నేటి నుంచి..

జ్ఞాన త్రిపురసుందరీదేవి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు సోమ వారం నుంచి 8వ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 3: కోలగట్లలో వెలసిన నాగారపమ్మదేవికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి, పొంగళ్లు పొంగి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పడమటిపాళెం షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు. .

దుర్గంపై యువకుల శ్రమదానం


దుర్గంపై గల తొట్టిని శుభ్రం చేస్తున్న యువకులు

ఉదయగిరి, మార్చి 3: ఐడియల్ యూత్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉదయగిరి దిలావర్‌భాయ్‌వీధి యువకులు ఆదివారం ఉదయగిరి దుర్గంపై ఉన్న కోన నీటితొట్టిని శుభ్రం చేశారు. పట్టణంలోని 50 శాతం మంది తాగే కోన నీటితొట్టి కాలువ అపరిశుభ్రంగా మారింది. దీన్ని గుర్తించిన యువకులు అందులో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయడంతో పట్టణ వాసులు యువకులను అభినందించారు. కార్యక్రమంలో ఐడియల్ యూత్ మూమెంట్ ఉదయగిరి శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్, మునాఫ్, కార్యదర్శి సాజిత్, మసూద్, ఇమ్రాన్, అజరుల్లా, సమత్, లతీఫ్, నస్రుల్లా, హుమాయిన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ఉదయగిరి రూరల్, మార్చి 3: శకునాలపల్లి పంచాయతీలోని కుర్రపల్లి బీసీ కాలనీకి చెందిన తిరుపతి రాజా అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ రేకలగుంట పద్మ ఆదివారం వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు దళితులు గుర్తొచ్చారా..?

చేజర్ల, మార్చి 3: మండలంలోని వైసీపీ నాయకులకు నాలుగేళ్ల పది నెలలు గుర్తురాని దళితులు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మీకు ఏమి పనికావాలన్నా చేసిపెడతామంటూ సంప్రదింపులు చేయడం ఆశ్చర్యంగా ఉందని టీడీపీ మండల దళిత నాయకుడు సోమవరపు హజరత్తయ్య ప్రశ్నించారు. ఆదివారం చేజర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో దళిత కాలనీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకోలేదని, ప్రస్తుతం వచ్చి హడావుడి చేయడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో జయరామయ్య, ఆంజినేయులు, తిరపతయ్య పాల్గొన్నారు.

నూతన పాలసీలను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, మార్చి 3: భారతీయ జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో వినియోగ దారుల సౌకర్యార్థం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆరు నూతన పాలసీలు ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఆర్‌కే రవికుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఆయన ఏజెంట్లతో సమావేశమై పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్

చంద్రబాబు రావాలి.. రాష్ట్రం బాగుపడాలి

- 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో ఇంటూరి

కందుకూరు, మార్చి 3: చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డు సాయినగర్‌లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నరకం చూయించిన జగన్మోహనరెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, అత్తంటి శివకృష్ణ, చుంచు వేణు, గుమ్మళ్ల మాల్యాద్రి, బత్తిన ఆదెమ్మ, రావి సరిత, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు

అలాగే పట్టణంలోని 9వ వార్డు పరిధిలో ఉన్న ఆదిఆంధ్ర కాలనీలో ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు.

మాజీ కౌన్సిలర్, వైసీపీ నేతలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వైసీపీ మాజీ కౌన్సిలర్ శేషమ్మ

కావలి, మార్చి 3: కావలి పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ మొలతాటి శేషమ్మతో పాటు 10, 11 వార్డులకు చెందిన పలువురు వైసీపీ నేతలు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, ఎస్సీ ఫిషర్‌మ్యాన్ సొసైటీ చైర్మన్ యల్లంటి వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు జ్యోతి బాబురావు, ఆత్మకూరు నాగరాజు, మేడికొండ సుకుమార్, వల్లేరి వెంకటకిరణ్‌కుమార్ సమక్షంలో వైసీపీ నేతలు బొడ్డు వెంకటనారాయయణ, మొలతాటి మనోహర్, మార్పుడి మాచర్ల, పీసీ రామారావు తదితరులు వారి అనుచరులతో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ నన్ను నమ్మి టీడీపీని గెలిపించేందుకు పార్టీలో చేరే వారికి సముచిత స్థానం కల్పిస్తానన్నారు. వారికి ఎప్పుడు ఎలాంటా కష్టం వచ్చినా వారి వెన్నంటే ఉంటూ వారి రుణం తీర్చు కుంటానన్నారు.

ప్రతిపక్షాలను విమర్శించే రాజకీయాలు చేయను

కందుకూరు, మార్చి 3: ప్రతిపక్ష నాయకులను విమర్శించడం, ప్రత్యర్థులపై బురదజల్లి లబ్ధి పొందడం లాంటి రాజకీయాలు చేయబోనని, అకారణంగా చంద్రబాబునో మరొకరినో విమర్శించమంటే విమర్శించేది లేదని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. కందుకూరులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మబద్ధంగా వ్యవహరిస్తానని, న్యాయం పక్షానే నిలుస్తానని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి గ్రామగ్రామాన ఎంతో అభివృద్ధి చేశారని, ఆ ఒరవడిని కొనసాగించాలనే ఇక్కడకు వచ్చానన్నారు. తనవెంట నడిచేవారికి అన్నివిధాలుగా అండగా నిలుస్తానన్నారు. ఈ సమావేశంలో షేక్ రఫి, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, మార్చి 3 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొన్నారు. ముందుగా అందిన సమాచారంతో ఆదివారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జునరావు, సిబ్బంది మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తీసుకొని వెళుతున్న ట్రాక్టర్‌ను స్థానిక రైస్‌మిల్లు వద్ద పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వైసీపీలో చేరిన మాలమహానాడు నేత శివాజీ

కావలిటౌన్, మార్చి 3: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ ఆదివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. కార్యకర్తలతో ర్యాలీగా ముసునూరులోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యేని, శివాజీలను కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేముల చెన్నకేశవులనాయుడు, షాహుల్, కుందుర్తి కామయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కందుకూరులో విజయ్‌కుమార్ పర్యటన

కందుకూరు, మార్చి 3: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ ఈనెల 5న కందుకూరు నియోజకవర్గంలో పర్యటిస్తారని పార్టీ సమన్వయకర్త బుద్ధకోటి, చవలం కొండయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు పామూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ ఆత్మీయుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌లో భాగస్వామిగా ఉన్న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాస్వామిక వాదులు, పేదల అభ్యున్నతి కోరుకునేవారంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బహుజనుల అభివృద్ధికి బీఎస్పీ పోరాటం

లింగసముద్రం, మార్చి 3 : బహుజనుల అభివృద్ధికి బీఎస్పీ పోరాడుతోందని కందుకూరు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి పేరం సత్యనారాయణ చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక నాయకులతో కలిసి లింగసముద్రంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం


రక్తదానం చేస్తున్న మహిళలు

కావలి, మార్చి 3: సేవియర్స్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలలో భాగంగా ఆదివారం రెడ్‌క్రాస్‌లో యువతులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతులు, మోటివేటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవియర్స్ మహిళా విభాగం సభ్యులు సౌందర్య దీపిక, దివ్య, శ్రావ్య, నవ్య, స్రవంతి, పూజిత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘికాలకు అడ్డాగా చెత్త నుంచి సంపద కేంద్రం

కొండాపురం, మార్చి 3: స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారి అసాంఘికాలకు నిలయమైంది. వివరాలకు మేరకు.. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఈ కేంద్రం గత ప్రభుత్వంలో నిర్మించినప్పటికీ చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యం నెరవేరడంలేదు. మొక్కుబడిగా అడపాదడపా మాత్రమే గ్రామం నుంచి చెత్త తరలించి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రేయింబవళ్లు తేడా లేకుండా మందుబాబులు అక్కడే తాగి సీసాలను పగులకొడుతున్నారు. దీనికితోడు రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి ఆగడాలకు అంతేలేకుండా పోతుందని, ఇప్పటికైనా పోలీసు శాఖ స్పందించి మందుబాబుల ఆగడాలను అరికట్టి ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


చెల్లాచెదురుగా పడిఉన్న ఖాళీ సీసాలు

పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడ ఆలయం వద్ద పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతో పాటు మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం 97శాతం పూర్తయిందని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు తెలిపారు. మండలంలో 7724 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సివుండగా 7575 మందికి పోలియో చుక్కలు వేసినట్లు, మిగిలిన చిన్నారులకు సోమ, మంగళ వారాలలో వేసి 100శాతం పూర్తి చేయనున్నట్టు తెలిపారు. మండలంలోని జొన్న వాడతోపాటు పలు ప్రాంతాల్లో అదనపు డీఎంహెచ్‌ఓ, డీటీసీఓ డాక్టర్ ఖాదర్‌వలి, డీడీ శివశంకర్‌బాబు పరిశీలించి పలు సూచనలిచ్చారు. మండలంలో పొలాలు, ఇటుక బట్టీల ప్రాంతాలతోపాటు పలు ప్రాంతాల్లో వున్న గిరిజన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ అహ్మద్‌బాబుతోపాటు అర్బన్ వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ మనోజ్, హెచ్‌ఈ. సుబ్బారెడ్డి పర్యవేక్షణలో 308 మంది ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని మండల అధ్యక్షురాలు గండవరపు సుగుణ పిలుపునిచ్చారు. ముత్తుకూరులో ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధి కారిణి గౌరవ చందన ప్రియ ఎంపీడీవో లక్ష్మణ కుమార్, వైద్యులు చైతన్య, పీహెచ్‌ఎన్ విలాంగిని, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: మండల పరిధిలో జరిగిన పల్స్ పోలియోలో 7706 మంది పిల్లలకుగాను 7606 మందికి (98.70శాతం) పోలియో చుక్కలు వేసినట్లు మహమ్మదాపురం ప్రాధమిక వైద్యాధికారి వి నరసింహరావు తెలిపారు. పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో, మొబైల్ బూత్ తోటల్లో, ఇటుక బట్టీలలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు.

మనుబోలు: మండలంలో చేపట్టిన పల్స్‌పోలియోలో 97శాతం లక్ష్యాన్ని సాధించారు. మనుబోలులో 4437 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు మోహసిన్ సుల్తానా, పూజిత, హోమియో వైద్యురాలు శిరీష, హెల్త్ సూపర్వైజర్లు వెంకటరమణయ్య, హైమావతి, సీహెచ్‌వో రాజయ్య, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం 2564 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 99.34శాతం పూర్తిచేసినట్లు మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. జగదేవిపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అస్తోటి జయమ్మ పోలియో చుక్కలు చిన్నారులకు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, వార్డు మెంబర్ రాధాకృష్ణ, ఏఎన్‌ఎం శ్రీకల్పవల్లి, రూట్ సూపర్‌వైజర్లు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాపూరు(డక్కిలి): మండంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో 98.3శాతం నమోదు అయినట్లు వైద్యాధికారిణి ప్రమీలా రాజకుమారి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సుదర్శనమ్మ, సూర్య ధర్మతేజ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ నిర్మాణంతో ప్రజాధనం వృథా

● సర్పంచి ఆవేదన



నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్

తోటపల్లిగూడూరు, మార్చి 3: మండలంలోని నరుకూరు పంచాయతీలో వైసీపీ నాయకులు వాటర్ ట్యాంక్ నిర్మాణంతో ప్రజాధనం వృథా చేస్తున్నారని సర్పంచ్ అన్నం శారద పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో ప్రజల దాహం తీర్చేందుకు, వారి అవసరాలకు 10 తాగునీటి బోర్లు ఉన్నాయని, వాటిలో 6 మాత్రమే వినియోగిస్తున్నామని మిగతా 4బోర్లు ఖాళీగా ఉన్నాయని, ఇప్పటికే ప్రజలకు పుష్కలంగా నీరు అందిస్తున్నామని తెలిపారు. గతంలో శ్మశానం పక్కన నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంటే, జానావారిపాలెంలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణం ఎందుకన్నారు. కనీసం సమాచారం ఇవ్వకుండానే ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్‌కు ప్రతిపాదనలు పంపించి 4 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ ఊసే లేదన్నారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కోరారు.

కంటేపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

వెంకటాచలం, మార్చి 3 : రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించాలని టీడీపీ నాయకులు కోరారు. మండలంలోని కంటేపల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు కలిసి ఉమ్మడిగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్తోటి నాగరాజు, రవికుమార్, రత్నం, సుబ్రహ్మణ్యం, ధనుంజయ, వెంకటేష్, బాలాజీ, భానుప్రకాష్, ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

పొదలకూరు, మార్చి 3: జగనన్న ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి పొదలకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివకృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

పొదలకూరు, మార్చి 3: వలంటీర్ల సేవలు ఎనలేనివని పట్టణ వైసీపీ నాయకుడు సోమా భాస్కర్ అన్నారు. ఆదివారం శ్రామికనగర్ అంకమ్మగుడి వద్ద వాలంటీర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం బ్రహ్మయ్య, జడ్పీటీసీ తెనాలి నిర్మల, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గంగవరపు లక్ష్మీకళ్యాణి, గుంజి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సోమా అరుణ, తదితరులు పాల్గొన్నారు.

తారకేశ్వరస్వామికి వేమిరెడ్డి ప్రత్యేక పూజలు



పూజలు చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విడవలూరు, మార్చి 3: మండల పరిధిలోని ముదివర్తి గ్రామంలో వున్న శ్రీ కామాక్షీ దేవి సమేత తారకేశ్వరస్వామి ఆలయంలో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభా కర్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు దేవిరెడ్డి కృష్ణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, మండల కోఆప్షన్ మెంబరు ఎస్‌కె రఫీ ఆధ్వ ర్యంలో జరిగిన కుంభాభిషేకం, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ వేడుకల్లో అయన పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, పురంధర్‌రెడ్డి, కొమ్మి శ్రీధర్‌నాయుడు, గ్రామ ఉపసర్పంచు సైదాపేట శరత్ చంద్ర, చలంచర్ల కామేశ్వరిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామి, అమ్మవార్లని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులతో పాటు టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3: స్థానిక రామకృష్ణానగర్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అంకురారోపణ కార్యక్రమంతో స్వామివారి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4గంటల నుంచి మృత్సంగ్రహణం (పుట్ట బంగారం) విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం అనంతరం అంకురారోపణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ పాలకమండలి ఉభయకర్తలుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాలను ఆలయ పండితులు అందలం నరసింహాచార్యులు, అరకట వేముల చంద్రకాంతాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 8గంటలకు ధ్వజారోహణ, అనంతరం తిరుచ్చి సేవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ పండితులు, కమిటీ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నేతలు



తోటపల్లిగూడూరు: సాలిపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తోటపల్లిగూడూరు, మార్చి 3: మండలంలోని సాలుపేట సెంటర్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గెద్ద కిషోర్, మహిళా మండలి ప్రెసిడెంట్ సునంద, శరత్, సుధీర్, ఉప్పల మస్తానయ్యగౌడ్, సుబ్రహ్మణ్యం, శివయ్య, పాల్గొన్నారు.

వెంకటాచలం : రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమని సర్వేపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూల చంద్రశేఖర్ తెలిపారు. వెంకటాచలంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీ లను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగెస్ పార్టీ మండలాధ్యక్షుడు నక్క శివ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశికుమార్, నాయకులు వెంకటేశ్వర్లు, అంకయ్య, పెంచలయ్య తదితరులున్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు జ్యోతిష్య బ్రహ్మ పురస్కారం



జ్యోతిష్య బ్రహ్మ పురస్కారం అందుకుంటున్న మురళీకృష్ణ

ముత్తుకూరు, మార్చి 3 : ముత్తుకూరుకు చెందిన జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు జ్యోతిష్య బ్రహ్మ పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వార్షికోత్సవ ఉగాది సంబరాల్లో ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు. సినీ నటులు కాదంబరీ కిరణ్, జెన్ని చేతుల మీదుగా పురస్కారాన్ని స్వర్ణ కంకణాన్ని అందుకున్నారు. అవార్డుగ్రహీత మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ పురస్కారం బాధ్యతను మరింత పెంచిందన్నారు. మురళీకృష్ణను స్థానిక నాయకులు అభినందించారు.

జగనన్న భూరక్ష కాదు.. భూభక్ష పథకం : సోమిరెడ్డి



పొదలకూరు : మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: దినేష్‌రెడ్డికి సమస్యలు చెబుతున్న గిరిజనులు

పొదలకూరు, మార్చి 3: భారీ అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకున్న జగనన్న భూ రీసర్వేను తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దుచేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి అన్నారు. మండలంలోని దుగ్గుంట రాజుపాలెం, కొత్త కంబాల పల్లి గ్రామాలలో ఆదివారం ఆయన బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలలో పాల్గొని సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ గ్రామాలకు చెందిన 15 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, చిరుమామిళ్ల సత్యనారాయణ, ఎన్ వెంకటేశ్వర్లునాయుడు, ఈతముక్కల బాబునాయుడు, దేవినేని శరత్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన 5వ వార్డు పరిధిలో ఆ వార్డు నాయకులు జాఫర్, షబ్బీర్, శివకుమార్, హేమంత్‌లతో కలిసి ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటూ టీడీపీ మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. కోవూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా 5వ వార్డులో కాలువకట్ట వెంబడి నివాసాలుంటున్న పలువురు గిరిజనులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీ శేషయ్య, హరికృష్ణ, రామానాయుడు, వి. గిరిప్రసాద్, కిషోర్, యజ్దాని, వెంకటేశ్వర్లురెడ్డి, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

దినేష్‌రెడ్డి విజయం ఖాయం : ఇమాంబాష

విడవలూరు: రానున్న ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విజయం తథ్యమని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమాంబాష తెలిపారు. ముదివర్తి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హజరత్, షరీఫ్, నరసింహులు, కార్తీక్, జగదీష్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఆశీర్వదించండి.. అభివృద్ధి చూపిస్తాం !

● ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి



వీపీఆర్, కోటంరెడ్డి, కొండలరావును సత్కరిస్తున్న టీడీపీ కార్యకర్తలు

నెల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని ఆదరించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. సీఎంగా చంద్రబాబును, ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని తెలిపారు. ఆదివారం రాత్రి రూరల్ నియోజకవర్గంలోని 22వ డివిజన్ బీవీనగర్‌కు చెందిన వైసీపీ ముఖ్యనేత ఉమ్మడిశెట్టి కొండలరావు, ఆయన అనుచరులు టీడీపీలో చేరారు. వీరికి వేమిరెడ్డి, కోటంరెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. వీపీఆర్ మాట్లాడుతూ కోటంరెడ్డి కష్టపడే వ్యక్తి అని ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కోటంరెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా ప్రజల మధ్యనే ఉన్నానని, ఇకపై కూడా నిరంతరం ప్రజలకు అందుబాటులోనే ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, దొడ్డపనేని రాజా నాయుడు, జెన్ని రమణయ్య, పనబాక భూలక్ష్మి, మాతంగి కృష్ణ, జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, కనపర్తి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి కార్యకర్తలు ఒక్కరు మిగలరు

● వెయ్యి మంది టీడీపీలో చేరిక

నెల్లూరు(వ్యవసాయం): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీ జెండా మోసేందుకు ఆ పార్టీకి ఒక్క కార్యకర్త కూడా మిగలరని అందరూ తెలుగుదేశం పార్టీలో చేరిపోతారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో 32వ డివిజన్ ఎన్‌టీటీ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు షేక్ ఆసిఫ్‌బాషా వారి మిత్రబృందం దాదాపు వెయ్యి మందికిపైగా టీడీపీలో చేరారు. 30వ డివిజన్ తిరుమల నగర్‌కు చెందిన తురకా రామకృష్ణ, వారి మిత్రబృందం కూడా టీడీపీలో చేరింది. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రమంతా టీడీపీ, జనసేన కూటమి ప్రభంజనం సృష్టించబోతోందని చెప్పారు. రూరల్ నియోజవకర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, మన్నేపల్లి రఘు, ఆషిక్ ఆలీఖాన్, శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రాజు, బంగారు రమణయ్య, వెంకటలక్ష్మయ్య, అశోక్, రాముడు, నాపూరు శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా పల్స్‌పోలియో



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీ ఆదాల, మేయర్

నెల్లూరు (వైద్యం), మార్చి 3 : నగరంలో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని పీపీ యూనిట్‌లో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో ఇంకా పోలియో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పీపీయూనిట్ హెడ్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు డాక్టర్ సుల్తాన్, డాక్టర్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఉస్మాన్ సాహెబ్‌పేటలోని శిరిడిసాయి ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసింది. గర్భకోశవ్యాధుల నిపుణులు డాక్టర్ వినీలరెడ్డి, అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఓట్టూరు మస్తానయ్య, వీరయ్య పాల్గొన్నారు.

● కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ నెల 4,5,6 తేదీలలో కూడా పల్స్‌పోలియో కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, డాక్టర్ నవీన్‌కృష్ణ, డాక్టర్ గీతాంజలి, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్య, నర్సులు పాల్గొన్నారు.

● **నెల్లూరు(హరనాథపురం):** నగరంలో ఉమ్మారెడ్డిగుంట ప్రాంతంలోని పల్స్ పోలియో కేంద్రంలో ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 21వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, మొయిళ్ల సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో పోలియో మందు వేస్తున్న డాక్టర్ మస్తాన్

● **నెల్లూరు రూరల్ :** అల్లీపురం పీహెచ్‌సీ పరిధిలో 97.5 శాతం పల్స్ పోలియో జరిగినట్లు వైద్యులు హజరత్‌రెడ్డి, బలరాంనాయక్ తెలిపారు. అలాగే మండలంలోని సౌత్‌మోపూరు పీహెచ్‌సీ పరిధిలో 93 శాతం మంది పిల్లలకు చుక్కల మందు వేశామని వైద్యుడు రవీంద్ర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మిగిలిన వారికి డోర్‌టుడోర్ కార్యక్రమంలో పూర్తి చేస్తామని వైద్యాధికారులు పేర్కొన్నారు.

స్టేడియంలో బీపీ, షుగర్ పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 3: ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైడ్ డయాగ్నస్టిక్స్ సౌజన్యంతో ఆదివారం స్టేడియంలో వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, కార్యదర్శి గుర్రం వెంకట సురేంద్ర, ట్రెజరర్ అరిగెల సాయిరాం, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్య, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు రంగారావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

తెలుగు భాష అమృతం : లక్ష్మీపార్వతి



యాకూబ్‌కు అవార్డు అందచేస్తున్న లక్ష్మీపార్వతి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 3 : తెలుగుభాష మృత భాష కాదని, అమృత భాష అని ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఆదివారం నెల్లూరు పురమందిరం ఏసీ హాలులో చిన్ని నారా యణరావు సాహితీ ఫౌండేషన్ తొలి సాహిత్య సభ జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాహిత్యంపై అభిలాష ఉన్న సీనియర్, వర్ధమాన సాహితీవేత్తల్లో స్ఫూర్తిని నింపేందుకు ఫౌండేషన్ స్థాపించినట్లు నారాయణరావు తెలిపారు. తొలి సాహిత్య అవార్డును హైదరాబాద్ కవి సంగమ ఉద్యమ సారథి యాకూబ్‌కు అందజేశారు. ఈ సభలో సాహితీవేత్తలు కలిమిశ్రీ, కంతా బంగారు రాజును సన్మానించారు. మరో 9 మందికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తుంగా శివప్రభాత్‌రెడ్డి, కళాంజలి అనంత్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కిషోర్స్ రత్నంలో ఘనంగా 'కల్చరల్ కాడెన్స్'



నృత్యం చేస్తున్న చిన్నారులు

నెల్లూరు : నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్, రేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం 'కల్చరల్ కాడెన్స్' పేరుతో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థల డైరెక్టరు డాక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యావిధానంలో మార్పులు చేస్తూ విద్యార్థుల పురోభివృద్ధిలో ముందంజలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో వివిధ దేశాల ప్రసిద్ధ నాట్యాలను, దేశంలోని వివిధ రాష్ట్రాల నాట్యరీతులను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారులు చక్కటి వేషధారణలో పాఠశాల విద్యావిధానాలను తెలియచేశారు. ఈ వార్షిక సంబరాల్లో రత్నం విద్యాసంస్థల డైరెక్టర్ వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాళ్లు జాస్మిన్, నాగేంద్ర, మేనేజర్ అజయ్‌సింగ్‌తోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన అష్టలక్ష్మీ యాగం



మహా సంప్రోక్షణ కలశం ఊరేగింపు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 3 : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో ఫిబ్రవరి 19 నుంచి జరుగుతున్న 22వ అష్టలక్ష్మీ యాగం ఆదివారం పూర్తయింది. అష్టలక్ష్మీ పీఠం స్వామి పీతాంబరం రఘునాథాచార్య ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రతువులో 9 ఇష్టయాగాలతో పాటు సామూహిక పూజలు, శ్రీలక్ష్మీ నారాయణుల కల్యాణం జరిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు. చివరిరోజు ఆదివారం ఉదయం అష్టలక్ష్మీ పీఠ పూజలు, కలశ తీర్థ సంప్రోక్షణ జరిగాయి. కార్యక్రమాలను శ్రీఅష్టలక్ష్మీ వైభవ దీపిక ఆధ్యాత్మిక సేవా సంస్థ, శ్రీఅష్టలక్ష్మీ యాగ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

6న రాజరాజేశ్వరికి పుష్పయాగం

● సుందరేశ్వరుడి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 3 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఈ నెల 6వతేదీకి 49 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ రోజు అమ్మవారికి మహా పుష్పయాగం జరుగుతుందని ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జే వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. వైసీపీ నగర అధ్యక్షుడు, రాజరాజేశ్వరి సేవా సమితి వ్యవస్థాపకుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు తరలిరావాలని కోరారు. కాగా, రాజరాజేశ్వరి ఆలయంలోని మీనాక్షి సమేత సుందరే శ్వరస్వామికి ఈ నెల 6 నుంచి 10వతేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. తొలిరోజు అంకురార్పణ, 7వతేదీ ధ్వజారోహణ, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, హోమాలు, రాత్రి రావణ సేవ జరుగుతాయన్నారు. 8వతేదీ ఉదయం గిన్నె భిక్ష, రాత్రి 10గంటలకు లింగోద్భవ అభిషేకం, రాత్రి 1గంటకు నందిసేవ, నగరోత్సవం జరుగుతాయన్నారు. 9వతేదీ రాత్రి కల్యాణం, గజవాహన సేవ, 10వతేదీ ధ్వజావరోహణం, ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

7న వైభవలక్ష్మీకి పుష్పయాగం

నగరంలోని మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో వైభవ లక్ష్మీ అమ్మవారికి ఈ నెల 7వతేదీ రాత్రి పుష్పయాగం జరుగుతుందని దేవస్థానం కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు ఉదయం 10గంటలకు పంచామృతాభిషేకం, రాత్రి 8గంటలకు హారతులు జరుగుతాయని తెలిపింది.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 : నగరంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ ధర్మకర్తలు, ఉభయకర్తలు పాల్గొని విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.

పల్లెల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

నెల్లూరు రూరల్, మార్చి 3 : రూరల్ మండలంలోని మాదరాజుగూడూరు, కలివెలపాళెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. త్వరలో పింఛన్ రూ.4 వేలు చేసేందుకు సీఎం జగన్ కసరత్తు చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీలో చేరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయకుమార్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకుడు వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

'నారాయణ' వైద్య శిబిరాలు

నెల్లూరు (వైద్యం), మార్చి 3 : నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్టోన్‌హౌస్‌పేట జేవీ హోమ్స్, బీవీ నగర్‌లోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం లేని వారికి నారాయణ మాతృసేవా పథకం ద్వారా ఉచితంగా ప్రసవాలు చేస్తున్నామని చెప్పారు. బిడ్డ పోషణ నిమిత్తం రూ.3వేల కూడా అందిస్తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో నారాయణ ఆరోగ్యమస్తు సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంజు ప్రభ, డాక్టర్ రావులపల్లి హరీష్, ఏజీఎం శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

చక్రధర్‌బాబు సేవలు ఘనం

● ఏపీజీబీ(ఓఏ-ఈఏ) రీజినల్ కార్యదర్శి అలీ

నెల్లూరు(హరనాథపురం), మార్చి 3 : ఏపీజీబీలో చీఫ్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వై చక్రధర్‌బాబు సేవలు ఘనమైనవని ఏపీజీబీ ఓఏ-ఈఏ రీజనల్ కార్యదర్శి లియాఖత్‌అలీ కొనియాడారు. ఆదివారం జడ్పీ సమావేశమందిరంలో చక్రధరబాబు సన్మానసభ జరిగింది. నాయకులు రమణయ్య, సతీష్, వాసు, నాయుడు, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.



చక్రధర్‌బాబు దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు


కన్నప్ప ఆలయం వద్ద ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు


కొండపైకి భక్తకన్నప్ప ఊరేగింపు


భిక్షాల గాలి గోపురం వద్ద అలంకరణ


ముక్కంటీశుడి ధ్వజస్తంభం వద్ద పుష్పాలంకరణ

భక్తుడికే తొలి పూజ

- శ్రీకాళహస్తిలో ఆగమోక్తంగా 'భక్త కన్నప్ప' ధ్వజారోహణం
- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

శ్రీకాళహస్తి, మార్చి 3: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం భక్త కన్నప్ప ఆలయం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. భక్తుడికి కొండపై స్థానం కల్పించి.. తొలి పూజను కూడా అతడికే జరిగేలా వాయులింగేశ్వర స్వామి వరమిచ్చిన కారణంతో కన్నప్ప ఆలయ ధ్వజారోహణ ఆగమోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ముక్కంటి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. కన్నప్ప ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అభిషేక పూజలు చేశాక మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ధ్వజస్తంభానికి పూజలు చేసి, హారతులు పట్టారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని ముక్కంటి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సన్నిధి వీధిలో బోయ కులస్థుల ఏర్పాటు చేసిన విడిది మండపంలో కొలువుదీర్చారు. సంప్రదాయం ప్రకారం ఉభయదారులైన బోయలు వస్త్రం, నైవేద్యం సమర్పించాక గ్రామోత్సవం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవోలు ధనపాల్, ఇన్‌స్పెక్టర్ హరిబాబుయాదవ్, పర్యవేక్షకులు విజయసారథి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా దూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను ఆదివారం ప్రారంభించారు. శ్రీకాళహస్తి క్షేత్రం విద్యుత్, పుష్పాలంకరణలతో ఆకట్టుకుంటోంది.

బ్రహ్మోత్సవాల్లో నేడు
- ఉదయం 9గంటలకు వెండి అంబారి సేవ
- మధ్యాహ్నం 12 గంటల నుంచి ముక్కంటి ధ్వజారోహణం ప్రారంభం
- రాత్రి 8గంటలకు వెండి అంబారి సేవ

ఏకాంతంగా ఆర్జిత సేవలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు జరిగే ఆర్జిత సేవలన్నీ ఏకాంతంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలు పూర్తయ్యేవరకు ప్రభాతసేవ, నిత్యోత్సవం, నిత్యకల్యాణం, చండీ, రుద్రహోమాలు, శయనోత్సవ సేవలను రద్దు చేశారు. రాహు, కేతు సర్ప దోష నివారణ పూజలకు మహాశివరాత్రి రోజున మాత్రమే విరామం ఇవ్వడం ఆనవాయితీ. మిగిలిన రోజుల్లో యథావిధిగా సాగనున్నాయి.

ఎన్నికల్లో సహకరించరనే..!

తిరుపతి జిల్లాగా ఏర్పడ్డాక నియమితులైన తొలి మహిళా ఎస్పీ.. మలికా గర్గ్. ఈమె గతనెల 12వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా 20 రోజుల్లోనే బదిలీ అయ్యారు. ఎన్నికల్లో తమకు సహకరించరని అధికార పార్టీ నేతలు నిర్ధారణకు రావడం వల్లే ఈ బదిలీ అన్న ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

- 20 రోజులకే ఎస్పీ బదిలీ వెనుక కారణమిదేనన్న ప్రచారం


మలికా గర్గ్

జిల్లాకు ఏ అధికారి వచ్చినా అధికార పార్టీ నేతలను కలిసి శాలువాలు కప్పడం.. పుష్పగుచ్ఛాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. అయితే ఎస్పీగా వచ్చిన మలికా గర్గ్ ఇటువంటివేమీ చేయలేదు. దీన్ని అధికార పార్టీలో పలువురు ముఖ్య నేతలు జీర్ణించుకోలేకపోయారని తెలిసింది. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే అవినీతి, విధి నిర్వహణలో అలసత్వం వంటి ఆరోపణలతో ఓ హెడ్ కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వారిలో ఒకరిపై చర్యలు వెనక్కు తీసుకోవాలని అధికార పార్టీ కీలక నేత ఒకరు చెప్పినా ఎస్పీ వినిపించుకోలేదని పోలీసు వర్గాల సమాచారం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై అకారణంగా రౌడీషీట్ తెరుస్తున్నారని ఆ పార్టీ నేతలు ఎస్పీని కలసి ఆందోళన వ్యక్తం చేయడంతో వారిని సమాధానపరిచి విచారణకు ఉపక్రమించారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి బైండోవర్ చేయాలని, మూడుకు మించి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై రౌడీ షీట్లు తెరవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆ క్రమంలో అధికార పార్టీకి చెందిన వారిపైనే ఎక్కువగా రౌడీషీట్లు తెరిచారని తెలుస్తోంది. ఈ పరిణామాలు అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదు.

కొండపై నుంచీ చక్రం తిప్పిన అధికారికీ చుక్కలు చూపిన వైనం

ప్రత్యేకించి గతంలో తిరుమల కొండపై నుంచీ జిల్లా అంతటా చక్రం తిప్పిన ఓ పోలీసు అధికారి ఎన్నికల నేపథ్యంలో దిగువకు బదిలీ అయ్యారు. సీఎంకు సన్నిహితుడిగా పేరుపడ్డ ఆ అధికారికి బందోబస్తు డ్యూటీలు వేసే సాహసం ఏ అధికారీ చేయలేదు. అయితే మలికా గర్గ్ అలాంటి మినహాయింపులేమీ ఇవ్వకుండా బందోబస్తు డ్యూటీ చేయించారని సమాచారం. ఆమే ఎస్పీగా కొనసాగితే తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఎపిక్ కార్డుల కేసుల దర్యాప్తులో కూడా ఇబ్బందులు తప్పవని అధికార పార్టీ నేతలు, అందులో పాలు పంచుకున్న పోలీసు అధికారులు ఆందోళనకు గురైనట్లు ఆ యా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ కారణాలకుతోడు ఎస్పీ తీరు గమనిస్తే వచ్చే ఎన్నికల్లో సహకరించే పరిస్థితి లేదని గ్రహించడంతోనే అధికార పార్టీ కీలక నేతలు సీఎంవోలో ఒత్తిడి తెచ్చి ఆమెను బదిలీ చేయించినట్లు రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. నిక్కచ్చిగా, నిజాయితీగా పనిచేస్తారని గుర్తింపు తెచ్చుకుంటున్న మహిళా పోలీసు అధికారిని కేవలం 20 రోజుల్లోనే అది కూడా ఎన్నికల సమయంలో బదిలీ చేయడం పట్ల అన్నివర్గాల నుంచీ విమర్శలు వస్తున్నాయి.


కాకర్లవారిపల్లె సమీపంలో ఏనుగుల ధ్వంసం చేసిన వరిపంట

పంట పొలాలపై ఏనుగుల స్వైరవిహారం

పాకాల, మార్చి 3: పాకాల, ఐరాల మండలాల పరిధిలో పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె, చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె సమీపంలోని పంట పొలాలపై శనివారం రాత్రి ఏనుగుల గుంపు స్వైరవిహారం చేసింది. పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె సమీపంలోని శిలగొందిమూల అటవీ ప్రాంత వద్ద మామిడితోటలు, కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె పరిసరాల్లోని వరిపొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. ఏనుగుల గుంపు సదుం మండల సరిహద్దు గుండాల కనుమ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మళ్లీ తిరిగి పాకాల మండల పరిసరాల్లో వంటలపై ఏనుగుల గుంపు దాడి చేస్తుందని రైతులు భయపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల విధులపై తొలిరోజు నుంచే ఖరాఖండీ ఆదేశాలు

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే వచ్చే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడడం ప్రథమ కర్తవ్యంగా భావించాలని కింది స్థాయి అధికారులకు ఖరాఖండీగా చెబుతున్నారు. సమీక్షల్లోనూ, పోలీసు స్టేషన్లు తనిఖీ చేసిన సందర్భాల్లోనూ అధికారులకు ఇవే చెబుతూ వచ్చారు. ముఖ్యంగా గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో జిల్లాకు చెడ్డపేరు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో అలాంటివి పునరావృతం కారాదని తేల్చి చెప్పారు. ఎవరైనా గీత దాటితే నిర్మొహమాటంగా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు కూడా నివేదిస్తామని కఠినంగా మాట్లాడుతూ వచ్చారు. ఆ క్రమంలో విధుల పట్ల అలక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించే కొందరు అధికారులకు చుక్కలు చూపించినట్లు ప్రచారంలో ఉంది.

నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

- మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా బదిలీ చేసిన ప్రభుత్వం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: జిల్లాకు నూతన ఎస్పీగా విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా ఆదివారం ప్రభుత్వం బదిలీ చేసింది. 2018 బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్ పటేల్‌ను శిక్షణ అనంతరం చింతూరు గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా నియమించారు. తర్వాత రంపచోడవరం ఏఎస్పీగా, అనంతరం కర్నూలు సెబ్ ఏఎస్పీగా పనిచేశారు.



రాష్ట్రంలో 'వైసీపీ' రాచరికం నడుస్తోంది

రాష్ట్రంలో 'వైసీపీ' రాచరికం నడుస్తోంది. రాష్ట్రాన్ని వైసీపీ రాజులు పరిపాలిస్తున్నారు. తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి రాజ్యం నడుస్తోంది. 20 రోజుల్లోనే ఎస్పీని బదిలీ చేయాల్సిన అగత్యం ఏంటి? మలికా గర్గ్ ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాక తిరుపతి ఎమ్మెల్యేని కలవకపోవడం, ఆయనకు అనుకూలంగా పనిచేయకపోవడమే బదిలీకి కారణం. తిరుపతిలో ఏ స్థాయి అధికారైనా వైసీపీ ఎమ్మెల్యేల ఆశీస్సులు తీసుకుంటే తప్ప వారు ఇక్కడ పనిచేయలేరని దీన్నిబట్టి స్పష్టమౌతోంది. నిజాయితీ కల్గిన ఓ అధికారిని ఇంత తక్కువ సమయంలో ఎందుకు బదిలీ చేశారో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

చెప్పినట్టు వినకపోతే మార్చేస్తారా?

మేము చెప్పినట్టు వినాలి. మేము చెయ్యమన్నదే చేయాలి. లేదంటే మార్చేస్తాం అన్న రీతిలో అధికార పార్టీ ఆగడాలు పెరిగిపోతున్నాయి. దీనికి నిదర్శనమే ఎస్పీగా మలికా గర్గ్ బదిలీ. ఈమె ఉంటే ఎన్నికల్లో తమకు ఇబ్బందులు వస్తాయని భావించడం వల్లే బదిలీ చేయించారు. ఇటువంటివి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రతిపక్ష పార్టీలన్నీ ముక్తకంఠంతో ఎదిరించాలి.

- పి.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఆదివారం.. ఈ ఒక్కరోజే చిత్తూరు రాజకీయాల్లో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హైదరాబాదులో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలోనే ఆ పార్టీలో చేరునున్నారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు టీడీపీకి మద్దతిచ్చారు. ఆ పార్టీ కండువాతో సమావేశంలోనూ పాల్గొన్నారు. బలిజసంఘం నేతలు సమావేశమై టీడీపీ అభ్యర్థి గురజాలకు మద్దతు ప్రకటించారు. ఇలా చోటుచేసుకున్న పరిణామాలన్నీ తెలుగుదేశం పార్టీని మరింత పటిష్ఠపరుస్తున్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఒక్కరోజులో..

- మారిపోయిన చిత్తూరు రాజకీయం
- పవన్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్యే ఆరణి
- టీడీపీకి సీకే మద్దతు
- తెలుగుదేశానికి సానుకూల పరిణామాలు


తన అనుచరులతో పవన్‌ను కలిసిన ఆరణి శ్రీనివాసులు

గతంలో టీడీపీ, ప్రజారాజ్యం పార్టీల్లో పనిచేసిన ఆరణి శ్రీనివాసులు.. 2009లో ప్రజారాజ్యం నుంచి..2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. పేరుకే ఈయన ఎమ్మెల్యే అయినా వ్యతిరేకవర్గం విజయానందరెడ్డికే పనులు అయ్యేవి.ఈ ఐదేళ్లు ఆయన అవమాన భారంతో నలిగిపోయారని చెప్పొచ్చు.ఎమ్మెల్యే టికెట్ తనకేనని చాలాకాలం కిందటే విజయానంద రెడ్డి ప్రకటించి, తదనుగుణంగా వర్గాన్ని సమీకరించుకునే పనిలో ఉన్నారు. ఇది బలిజల సీటు అనే నమ్మకంతో ఆరణి కూడా సైలెంట్‌గా ఉండిపోయారు.తీరా ఎన్నికల సమయంలో వైసీపీ అధిష్ఠానం విజయానందరెడ్డికి టికెట్ ఇచ్చింది. ఆరణి శ్రీనివాసులును రాజ్యసభకు పంపిస్తానని చెప్పి మోసం చేసి, వేరేవాళ్లకు అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్యే టికెట్ రాకపోవడం,రాజ్యసభకు పంపకపోవడంతో ఆయన మరింత కుంగిపోయారు. ఈ క్రమంలో ఆయనకు బలిజ సంఘం మద్దతుగా నిలిచింది. తనకు టికెట్ ఇవ్వకున్నా.. రాజ్యసభకు పంపిస్తామని మోసంచేసినా.. పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం తరహాలో ఆరణి తన అసంతృప్తిని వెల్లగక్కలేదు. సైలెంట్‌గా చేయాల్సిందంతా చేసేశారు. ఆదివారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసిన ఆయన.. నాలుగు రోజుల్లో అధికారికంగా మంగళగిరి కార్యాలయంలో జనసేనలో చేరనున్నారు. టీడీపీ- జనసేన పొత్తు నేపథ్యంలో చిత్తూరులో గురజాల గెలుపునకు ఆరణి కృషి చేయాల్సి వస్తుంది. ఆ మేరకు సిద్ధమైనట్లు ఆయన వర్గీయులు అంటున్నారు. కాగా, రాజంపేట లోకసభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆరణి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పవన్‌ను ఈయనతోపాటు శివ, వినాయక బాలాజీ కలవగా.. తిరుపతి నేతలు హరిప్రసాద్, కిరణ్ రాయల్ వెంట ఉన్నారు. పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే కలిసిన విషయం తెలుసుకున్న వైసీపీ అధిష్ఠానం ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది.

టీడీపీకి మద్దతిచ్చిన సీకే



ఓసారి స్వతంత్ర, మూడుసార్లు కాంగ్రెస్ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచిన సీకే బాబు.. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు మద్దతు ప్రకటించారు. చాలాకాలం ఈయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదివారం తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ కూడా హాజరై మద్దతు కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. పార్టీ విజయానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. యువనేతలను రాజకీయాల్లో ప్రోత్సహించాలన్నారు. తన అభిమానులకు, కుటుంబ సభ్యులకు గురజాలను పరిచయం చేసి ఆయన గెలుపునకు సహకరించాలని కోరారు. టీడీపీ నేత చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీకే బాబు, ఆయన అనుచరులతో కలిసి ఆర్‌ఎల్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశానికి గురజాల ర్యాలీగా వెళ్లారు.

'తిరుపతి'కి పెరిగిన పోటీ

- టీడీపీ, జనసేన నుంచి ప్రచారంలో ఇతర ప్రాంతాల నేతల పేర్లు

తిరుపతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ సీటు కోసం టీడీపీ, జనసేన పార్టీల్లో పోటీ పెరుగుతోంది. ఇదివరకూ నియోజకవర్గానికి చెందిన నేతలు మాత్రమే పోటీ పడగా, ఇపుడు ఇతర ప్రాంతాల వారి పేర్లూ తెరపైకి వస్తున్నాయి. టీడీపీ నుంచి ప్రముఖ వ్యాపారవేత్త గంటా నరహరి పేరు హఠాత్తుగా ప్రచారంలోకి వచ్చింది. జనసేన టికెట్ రేసులో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిలిచారు. ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గంలో కలకలం సృష్టిస్తున్నాయి.

టీడీపీ నుంచి ప్రచారంలో గంటా నరహరి పేరు

తిరుపతిలో టీడీపీ టికెట్ కోసం ఇప్పటికే చాలామంది రేసులో ఉన్నారు. బలిజ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాసులు, ఎడిఫై విద్యా సంస్థ యజమాని ప్రణీత్, ఎలైట్ ఆస్పత్రి యజమాని కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు, బీసీ సామాజిక వర్గం నుంచి నరసింహ యాదవ్, రెడ్డి సామాజికవర్గం నుంచీ మబ్బు దేవనారాయణరెడ్డి తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. వీరంతా తిరుపతి నియోజకవర్గానికి చెందిన వారు. బలిజ సామాజికవర్గం అధికంగా ఉన్నంతున ఆ వర్గానికే టికెట్ కేటాయించాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. అది కూడా పొత్తులో జనసేనకు సీటు కేటాయించని పక్షంలో.అయితే అధికార పార్టీ నేతల దౌర్జన్యకర సంస్కృతిని బలంగా ఎదిరించలేకపోతున్నారని కొందరిని, సామాజిక సమీకరణల్లో మరికొందరిని,ఆర్థికంగా బలంగా లేరన్న కారణంతో మరికొందరిని...పరిగణనలోకి తీసుకునేందుకు అధిష్ఠానం తటపటాయిస్తోంది. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అంతుబట్టక తిరుపతిలో టీడీపీ వర్గాలు అయోమయంలో వున్నాయి. ఇలాంటి తరుణంలో హఠాత్తుగా గంటా నరహరి పేరు తెరపైకి వచ్చింది. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత సత్యప్రభ సోదరి అల్లుడైన ఇతడిని ఇదివరకూ చంద్రబాబు మదనపల్లె మినీ మహానాడులో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కొంతకాలం రాజంపేట లోక్‌సభ పరిధిలో చురుగ్గా పనిచేసిన ఆయనకు ఎంపీ సీటు కాకుండా రాజంపేట అసెంబ్లీ సీటు కేటాయిస్తారన్న ప్రచారం జరిగింది.ఇప్పుడు వున్నట్టుండి తిరుపతి టీడీ పీ టికెట్ ఆయనకే దక్కుతుందన్న ప్రచారం మొదలైంది. తిరుపతిలో బలిజ సామాజికవర్గం బలంగా వుండడం, ఆ వర్గాలకు డీకే ఆదికేశవులు కుటుంబం పట్ల గౌరవాభిమానాలున్న నేపథ్యంలో ఆ కుటుంబం తరపున నరహరి తిరుపతిలో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారని సమాచారం. ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో అధికార పార్టీ అభ్యర్థిని మించి ఖర్చు పెట్టగలిగిన శక్తి వుందని, అందువల్లే అధిష్ఠానం నరహరి వైపు మొగ్గు చూపుతోందన్న ప్రచా రం సాగుతోంది.

జనసేన టికెట్ రేసులో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి

అనూహ్య పరిణామాల నడుమ తిరుపతి జనసేన టికెట్ రేసులో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిలిచారు. ఈసారి చిత్తూరు టికెట్ ఆయనకు ఇవ్వకపోవడం.. రాజ్యసభ అవకాశాన్ని ఇస్తామని మొండిచేయి చూపడంతో అసంతృప్తికి లోనైన ఆయన.. ఆదివారం హైదరాబాదులో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. అక్కడ నుంచి వెనుదిరిగాక తిరుపతిలో బలిజ సామాజికవర్గానికి చెందిన పలువురు ముఖ్యులకు ఆరణి శ్రీనివాసులు ఫోన్లు చేసి తనకు తిరుపతి జనసేన టికెట్ వచ్చే అవకాశముందని, సాయం చేయాలని కోరినట్టు తెలిసింది. క్లాస్ వన్ కాంట్రాక్టరైన శ్రీనివాసులు కూడా ఆర్థికంగా బలమైన వ్యక్తి. తిరుపతిలో వైసీపీ అభ్యర్థిని ఎదుర్కొనే విషయంలో ఆర్థికంగా పోటీ పడే సామర్థ్యం ఉంది. ఈ ఫోన్ కాల్స్ సమాచారం బలిజ సామాజికవర్గంలోనూ, జనసేన పార్టీలోనూ వేగంగా ప్రచారం కావడంతో రాజకీయంగా కలకలం రేగింది. పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ నుంచీ గంటా నరహరి లేదా జనసేన నుంచీ ఆరణి శ్రీనివాసులుకు అవకాశం ఇచ్చినా ఇద్దరూ బలమైన అభ్యర్థులే అవుతారన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇవి ప్రచారాలుగానే మిగిలిపోతాయా లేదా ఇద్దరిలో ఒకరు ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం దక్కించుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారుతోంది.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు





చిల్లకూరు బస్టాండు - అడవిని తలపిస్తున్న మరుగుదొడ్లు

చిల్లకూరు, మార్చి 3: మండల కేంద్రమైన చిల్లకూరులో ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారింది. బస్సులు రాకపోవడంతో పాటు నిర్వహణ లేకపోవడంతో బస్టాండు నిరుపయోగంగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం మండలంలోని గ్రామాల నుంచి ఆయా పనులపై చిల్లకూలోని ప్రభుత్వ కార్యాలయాలకు, పీహెచ్‌సీ, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వచ్చి వెళ్లే ప్రయాణికుల కోసం స్థానిక తెలుగుగంగ కార్యాలయం సమీపంలో బస్టాండు నిర్మించారు. బస్టాండులో దుకాణ సముదాయం, మరుగుదొడ్ల వంటి వసతులను సమకూర్చారు. అయితే మండలంలోని గ్రామాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి రాకుండా సమీపంలోని సర్వీస్సు రోడ్డులో నుంచి వెళుతున్నాయి. దీంతో బస్టాండు నిరుపయోగంగా మారింది. రాత్రి సమయంలో పలువురు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా యాచకులకు, పలు ప్రాంతాల నుంచి వచ్చే గుర్తు తెలియని వారు కూడా ఇక్కడే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు గుర్తుతెలియని వ్యక్తులు ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండు వద్ద బస్సులు వచ్చేలా అధికారులు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

టీడీపీలో చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



టీడీపీ చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మార్చి 3: పెళ్లకూరు మండలంలోని రోసనూరు, రోసనూరు రాజుపాలెం గ్రామాలకు చెందిన సుమారు 30 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగానికి పురుడుపోసింది టీడీపీ అధినేత చంద్రబాబునాయుడేనని కొనియాడారు. ఉన్నత విద్యావంతురాలైన డాక్టర్ నెలవల విజయశ్రీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, రాపూరు పరశరామ్ తదితరులు నాల్గొన్నారు.

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు: పాశం



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 3: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీలోకి చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విఘ్నేశ్వరపురంలో పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. దోచుకోవడమే పనిగా పాలన సాగిస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసేలా చంద్రబాబు నాయుడు మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కష్టపడి పనిచేసి టీడీపీని గెలిపించుకుని చంద్రబాబునాయుడుని సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, నరసింహులు, వాటంబేడు శివకుమార్, తూపిలి సురేంద్ర, ప్రవీణ్, ప్రణీత్, ప్రకాశ్, చంద్రమౌళి, మణికంఠ, రఘు, ఉదయ్, బాలు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనపై యుద్ధానికి సిద్ధం కండి: కురుగొండ్ల

వెంకటగిరి, మార్చి 3: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు యుద్ధానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ పరిధిలోని 12వ వార్డు మందలిళ్ల ప్రాంతంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగోటి నాగేశ్వరావు, పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, తాండవ చంద్రారెడ్డి, కొప్పరపు చంగారావు, మల్లారం బాబు, సుధ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి



ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

గూడూరు, మార్చి 3: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకుడు పరిమల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని త్యాగరాజవీధి, అరుంధతీయపాళెం తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తుందన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500కే అందజేస్తుందన్నారు. అలాగే రైతులకు రుణమాఫీతో పాటు యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తుందన్నారు.

కట్టువ తగులబెట్టారని పోలీసులకు ఫిర్యాదు

బాలాయపల్లి, మార్చి 3: మండలంలోని కడగుంట గ్రామంలోని సర్వే నంబరు 174-69ఏ, 174-70ఏ, 174-70బీ లో ఉన్న 6.10 ఎకరాల భూమి చుట్టూ ఉన్న కట్టువను గ్రామానికి చెందిన కొందరు తగలబెట్టారని వప్పతొట్టి అంకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఆధీనంలో ఉన్న భూమికి ప్రభుత్వం హక్కులు కల్పించిందని, కొందరు ఆక్రమణదారులు సాగుకు అడ్డు తగులుతుండడంతో వెంకటగిరి సివిల్ కోర్టుతో పాటు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో కేసు వేయడం జరిగిందన్నారు. అయితే ఆదివారం కొందరు అక్రమంగా భూమిలోకి ప్రవేశించి తమ పొలం చుట్టూ ఉన్న కట్టువను తగలబెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భవిష్యత్తులో అమరలో ప్రపంచస్థాయి వైద్యసేవలు

గల్లా రామచంద్రనాయుడు



గల్లా దంపతులను సన్మానిస్తున్న డాక్టర్లు రమాదేవి, ప్రసాద్

రేణిగుంట, మార్చి 3: భవిష్యత్తులో అమర ఆస్పత్రిలో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందిస్తామని అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు వెల్లడించారు. ఆదివారం రేణిగుంట - కడప మార్గంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రి మూడో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సొంత జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని భావించామన్నారు. అందుకే తాము అమరరాజ సంస్థలను ఇక్కడే నెలకొల్పామన్నారు. నేడు ప్రపంచస్థాయిలో అన్నిదేశాలకు తమ సంస్థ ఉత్పత్తులు పంపుతున్నామని చెప్పారు. అమర ఆస్పత్రి ఏర్పాటు చేసే సమయంలోనూ విశాఖపట్టణం, హైదరాబాదు నగరాల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని తమ కుటుంబంలో చర్చలు జరిగాయని వివరించారు. అయితే తిరుపతి సమీపంలో ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తే బాగుంటుందని సలహా ఇచ్చానన్నారు. తన ఆలోచనను అనుసరిస్తూ మూడేళ్ల క్రితం ఇక్కడ అమర ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. అనతికాలంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. మరో పదేళ్లలో ప్రపంచ దేశాలలో లభించే వైద్యసేవలు లభించే అవకాశం ఉందన్నారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ పరిశ్రమలతో పాటు వైద్యరంగంలోనూ తమపిల్లలు ఏర్పాటు చేసిన ఆస్పత్రి సేవలు ఖండాంతరాల్లో పేరు గడించేలా డాక్టర్లు ప్రసాద్, రమాదేవి కృషి చేయడం అభినందనీయన్నారు. మాతృభూమికి సేవ చేసేందుకే అమెరికా నుంచి ఇక్కడికి వచ్చామని డాక్టర్ గౌరినేని ప్రసాద్ తెలియజేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, మార్చి3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతి చెందిన కిషోర్

పెళ్లకూరు, మార్చి 3: టిప్పర్, కారు ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం అర్థరాత్రి 71వ జాతీయ రహదారిపై పెళ్లకూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కావలి పట్టణానికి చెందిన డ్రైవర్ కిషోర్(37)తో పాటు రషీద్, ఫాతిమా, షాహిద్ కారులో చిత్తూరు జిల్లా విరుపాక్షపురానికి పక్షవాతం మందు కోసం బయలుదేరారు. పెళ్లకూరు పెట్రోల్ బంకు సమీపంలో శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు గ్రావెల్ లోడుతో వెళ్తున్న టిప్పర్ ఎదురుగా వస్తూ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో నాయుడుపేటకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

మీ ఇంటి ఆడపడుచును.. ఆశీర్వదించండి: విజయశ్రీ



కార్యక్రమంలో నెలవల విజయశ్రీతో టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 3: వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవలోకి వచ్చానని, మీ ఇంటి ఆడపడుచుగా భావించి తనను ఆశీర్వదించాలని టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ కోరారు. ఆదివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో సూళ్లూరుపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విజయశ్రీ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్న తనకు ప్రజాసేవ చేసేందుకు చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైసీపీ ఆగడాలు ఇకపై సాగవన్నారు. అందరి సహకారంతో ఈసారి సూళ్లూరుపేటలో పసుపు జెండా ఎగురువేస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసి విజయశ్రీని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, రమణయ్య, బుజ్జిబాబు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీని అఖండ మెజార్టీతో గెలిపిస్తాం: జనసేన

నాయుడుపేట టౌన్, మార్చి 3: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీని అఖండ మేజార్టీతో గెలిపిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస మినీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జనసేన పార్టీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, పద్మజ, సుజాత, కేశవరెడ్డి, కిరణ్‌కుమార్, సతీష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా మోసిన కార్యకర్తలకు సముచితస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న కందల కృష్ణారెడ్డి

నాయుడుపేట టౌన్, మార్చి 3: టీడీపీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ సముచితస్థానం ఉంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన సూళ్లూరుపేట అభ్యర్థి విజయశ్రీ విజయానికి సమష్టిగా కృషిచేసి అఖండ మేజార్టీతో గెలిపిస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనలో టీడీపీ కార్యకర్తలు కష్టాలు పడి పార్టీ జెండాను మోశారని, అలాంటి వారికి పూర్తిగాన్యాయం చేయడంతో పాటు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఆళ్ల రాజారెడ్డి, నిత్య కృష్ణారెడ్డి, ప్రసాద్‌యాదవ్, సుబ్రహ్మణ్యం, పాదర్తి ప్రకాష్‌నాయుడు, గీతారెడ్డి, హైమావతి, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గూడూరు, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని తహసీల్దారు కరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రంలో పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఐదేళ్ల వయస్సు కలిగిన పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పోలియో కేంద్రాలను పరిశీలించారు.

చిల్లకూరు: మండలంలో 98శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఐదేళ్ల లోపు 7,417 మంది చిన్నారులు ఉండగా 7,283 మందికి పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు.

వెంకటగిరి టౌన్: ఐదేళ్లలోపు చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ శేషమ్మ అన్నారు. ఆదివారం స్థానిక బెటాయన్, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బాలాయపల్లి: మండలంలో 3360 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ప్రమీల తెలిపారు. మొత్తం 24 పంచాయతీల్లో 54 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు.

కోట: మండలంలో 5,494 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇందుకోసం 43 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, చిట్టేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

డక్కిలి: మండలంలో 4445 మంది చిన్నారులు ఉండగా 4375 మందికి పోలియో చుక్కలు వేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. మిగిలిన వారికి 4,5 తేదీల్లో పోలియో చుక్కలు వేసి వందశాతం పూర్తి చేస్తామన్నారు.

నాయుడుపేట: మండలంలో 3297 మంది చిన్నారులకు గాను 3191మందికి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ వికాస్ తెలిపారు. అలాగే పట్టణంలోని ఎల్‌ఏ సాగరం పీహెచ్‌సీ పరిధిలో 20005 మందికి, తుమ్మూరు పీహెచ్‌సీ పరిధిలో 4193 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ జనార్ధనరెడ్డి, డాక్టర్ సుబ్బురాజు తెలిపారు.

ఓజిలి: మండలంలోని ఓజిలితో పాటు పెద్దపరియ, అత్తివరం, వజ్జావారిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఓజిలిలో 1718 మందికి, పెద్దపరియలో 1053 మందికి, అత్తివరంలో 718 మందికి, వజ్జావారిపాళెంలో 667 మందికి పోలియో చుక్కలు వేసినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్య సిబ్బంది తెలిపారు.

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 2,182 మంది చిన్నారులుండగా 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి డాక్టర్ సునీలా, సూపర్‌వైజర్ కన్నెమ్మ ఆధ్వర్యంలో నూరుశాతం మందికి పోలియో చుక్కలు వేశారు. అదేవిధంగా మండలంలో 3,850 మంది చిన్నారులకు(98 శాతం) పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

తడ: మండలంలో 98 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. రామాపురం పీహెచ్‌సీ పరిధిలో 1584 మందికి, తడ పీహెచ్‌సీ పరిధిలో 2,380 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు పీహెచ్‌సీ పరిధిలో 1052 మందికి(97.5 శాతం), పెళ్లకూరు పీహెచ్‌సీ పరిధిలో 2338 మందికి(95.25 శాతం) పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు చంద్రమోహన్, సుజాతమ్మ తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత కోస్టల్ లెవెన్స్



ట్రోఫీ అందజేస్తున్న హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం

చిల్లకూరు, మార్చి 3: మండలంలోని ఏరూరు గ్రామంలోని శివగణేష్ క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కోస్టల్ లెవెన్స్ జట్టు నిలిచింది. ఆ జట్టుకు వరగలి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాత స్నేహితులంతా ఏటా సీనియర్ క్రికెట్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రఘుబాబు, మోహన్, వెంకటేశ్వర్లు, చిరంజీవి, మునిశేఖర్‌గౌడ్, శేషారెడ్డి, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు బూత్‌స్థాయిలో సిద్ధం కండి

సూళ్లూరుపేట, మార్చి 3. సార్వత్రిక ఎన్నిలకు బూత్ స్థాయిలో అందరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నపాటి విబేధాలు ఉన్నా ఎన్నికల్లో అందరూ కలిసి పనిచేసి వైసీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చిన్ని సత్యనారాయణ, పోలూరు పద్మ, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, నాయుడుపేట మున్సిపాలిటీ చైర్మన్ దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

డక్కిలి, మార్చి 3 మండలంలోని కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. దగ్గవోలు పరిసరాల్లో కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ చౌడయ్య సిబ్బందితో దాడులు నిర్వహించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.1400 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

బాలాయపల్లి: మండలంలోని వాఖ్యం గ్రామంలో కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ మహబూబ్‌సుభానీ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, రెండు మోటారు సైకిళ్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం స్వాధీనం

గూడూరు, మార్చి 3: మండలంలోని రెడ్డిగుంటసంగం గ్రామంలో చెంచయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2,800 విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో సిబ్బంది ఆర్‌వీరాజు తదితరులు పాల్గొన్నారు.

నోటీసుల పేరిట పేదలను ఇబ్బంది పెట్టడం తగదు

నాయుడుపేట టౌన్, మార్చి 3: పట్టణ పరిధిలోని పొగగొట్టంకాలనీ వాసులను నోటీసుల పేరిట ఇబ్బందులుపెట్టడం సబబు కాదని మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ అన్నారు. పొగగొట్టం కాలనీలోని ఎక్కువగా పేదలలే ఉన్నారని, అక్కడ ఇళ్ల స్థలాల విషయం కోర్టులో ఉండగా వివిధ కారణాలతో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. అధికారులు వాస్తవాలు తెలుసుకొని పొగగొట్టంకాలనీ వాసులకు న్యాయం చేయాలని సూచించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, మార్చి 3: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. ముత్యాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



బుట్ట కమ్మలు అందజేస్తున్న భక్తుడు

సూళ్లూరుపేట, మార్చి 3: చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి నాయుడుపేటకు చెందిన లింగారెడ్డి ప్రకాష్ రెడ్డి రూ.లక్ష విరాళం ఆదివారం అందజేశారు. అదేవిధంగా నాయుడుపేటకు చెందిన మరో భక్తుడు ఎస్.సురేంద్రబాబు అమ్మవారికి 8 గ్రాముల బంగారు బుట్ట కమ్మలు విరాళంగా అందజేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు మాతృవియోగం

పెళ్లకూరు, మార్చి 3: మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు కుటుంబంలో విషాదం నెలకొంది. శేఖర్‌నాయుడు తల్లి సుబ్బమ్మ ఆదివారం తొట్టంబేడు మండలం గుర్రప్పనాయుడుకండ్రిగలో కన్నుమూశారు. ఆమె మృతి పట్ల మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

వైసీపీని నమ్మి మోసపోయా

స్వతంత్ర అభ్యర్థిగానైనా తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా

గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



కళత్తూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కేవీబీపురం, మార్చి 3: 'వైసీపీని నమ్మి మోసపోయా. స్వతంత్ర అభ్యర్థిగానైనా తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా' అని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు చెప్పారు. ఆదివారం కేవీబీపురం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కళత్తూరులో వైసీపీ నాయకుడు అనీల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గతంలో వైసీపీకి ఎంపీగా సేవలందించానని, ప్రస్తుతం గూడూరు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేస్తున్నానని తెలిపారు. ఇన్ని చేసినా సీఎం జగన్ తనను గుర్తించకపోవడం దారుణమన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే కలెక్టర్ పదవిని కూడా వదులుకుని రాజకీయల్లోకి వచ్చానన్నారు. ఏ పార్టీ పిలిచి టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా తిరుపతి ఎంపీ స్థానానికి పోటీచేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

మత్తులో యువత చిత్తు: తెలుగు యువత

వెంకటగిరిటౌన్, మార్చి 3: రాష్ట్రంలో మద్యం, గంజాయి విక్రయాలు తారాస్థాయికి చేరాయని, యువతకు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గెరిటి చెంచయ్య అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే దశల వారీగా మద్యం నిషేధం అమలు చేస్తామని చెప్పిన జగన్ వాటి అమ్మకాలు రెట్టింపు చేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. గంజాయి విక్రయాలు, వినియోగం జోరుగా సాగుతుండంతో యువత పక్కదోవ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్యం నిషేధం అమలు చేయడంతో పాటు గంజాయి విక్రయాలను అరికట్టాలని చెంచయ్య అన్నారు.

'కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందాం'



సమావేశంలో ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు

గూడూరు, మార్చి 3: అందరం కలిసికట్టుగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల అభివృద్ధికి దోహదపడే రాజకీయ పార్టీలకు మద్దతు ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాసుదేవరావు, కామేశ్వరవరప్రసాద్, శివరామకృష్ణ, గురుప్రసాద్‌రావు, శ్రావణ్‌కుమార్, నరేష్, బాలాజీ, జనార్ధన్, శ్రీనివాసరావు, పవన్‌కుమార్, నారాయణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, మార్చి 3: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి, చిల్లకూరు మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రేజీ ప్లే స్కూల్ ప్రారంభం

నాయుడుపేట, మార్చి 3: పట్టణంలోని ఆకుతోట వీధిలో నూతనంగా క్రేజీ ప్లే స్కూల్‌ను శ్రీవేమ విద్యాసంస్థల అధినేత శ్రీనివాసులురెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, విద్యాకేంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, స్కూల్ నిర్వాహకులు రాజేశ్వరి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.